మా అన్నయ్య

కవితా సంకలనం

సంకలనకర్త:

గబ్బిట దుర్గాప్రసాద్

ప్రచురణ:

సరసభారతి

ఉయ్యూరు, కృష్ణాజిల్లా

MAA ANNAYYA

Telugu Poems

Edited by

Gabbita Durga Prasad

First Edition: **JUNE 2016**

Copies: 500

(C) **Author**

Price. Rs.**40/-**

Cover Design: **Kalasagar**

For Copies: **Gabbita Durga Prasad**
President, "Sarasabharathi"
H.No.2-405, Sivalayam Street,
Near Raja gari kota, Vuyyuru- 521 165
Krishna Dist. Phone:08676- 232797
Cell: 9989066375
e-mail: gabbita.prasad@gmail.com
sarasabharati.vuyyuru@gmail.com
http/sarasabharati.wordpress.com
http/suvarchalanjaneyaswamy.wordpress.com

Type Setting: **"Ramya Bharathi"** vja

Printed : **Rainbow Graphics,** vijayawada-2

అంకితం

సత్వ గుణ సంపన్నులు

కీ॥ శే॥ తాడికొండ భోగ మల్లికార్జునరావు

శ్రీమతి బాలా త్రిపురసుందరీ లలితకుమారి

దంపతులకు

ఆత్మీయ అంకితం

జననం– అభోగ భాగ్య బాల్యం

శ్రీ తాడికొండ "భోగ" మల్లికార్జునరావు గారు గుంటూరు జిల్లా నరసరావుపేటలో మాతామహుల ఇంట జన్మించారు. తలిదండ్రులు శ్రీ మల్లికార్జునరావు, శ్రీమతి సుబ్బమ్మ దంపతులకు ఏకైక సంతానం. తండ్రిగారిది విజయవాడలోని కృష్ణలంక. రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా పని చేశారు. పేరు భోగమల్లికార్జుడే కాని బాల్యం ఆ భోగ వైభోగాలు లేకుండా అతి పేదరికంలోనే గడిచింది. పుట్టిన ఏడాదికే తండ్రిని, మరో ఏడాదికి తల్లినీ కోల్పోయిన అభాగ్యులయ్యారు. అమ్మమ్మ కూతుర్ని మనవడిని గుంటూరు జిల్లా పెద పులివర్రుకు తీసుకొని వెళ్ళి గారాబంగా పెంచింది. ఆ కుటుంబంలో వీరిదే చదువుకొన్న కుటుంబం. కనుక తల్లి భోగ మల్లికార్జునుని కోసం ఒక భోషాణం నిండా బంగారు నగలు చేయించి దాచింది. ముందుగా భర్త క్షయ వ్యాధి వచ్చి చనిపోయారు. తరువాత ఈమెకూ వ్యాధి సోకి చనిపోయింది. తలిదండ్రులిద్దరూ లేని అభాగి అయ్యారు. ఎవరూ పట్టించుకోలేదు. దిక్కులేని వాడిని చేసి వదిలారు బంధుగణం. ఎవరైనా వేళకు ఇంత ముద్ద పెడితే తినటం లేకపోతే పస్తు. పెద పులివర్రులో భోగ మల్లికార్జునరావు గారికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి భరించలేక, ఆయన మేనత్త అంటే ప్రముఖ సినీ దర్శకుడు శ్రీ కాశీనాధుని విశ్వనాథ్ గారి తల్లి ఈ దారుణాన్ని భరించలేక వీరి బాబాయిలకు పిల్లాడిని తీసుకొని వెళ్ళి జాగ్రత్తగా పెంచుకోమని రహస్యంగా ఉత్తరం రాసింది. బాబాయిలు వచ్చి చూసి పరిస్థితిని అర్థం చేసుకొన్నారు. తమ వదినగారు చేయించిన భోషాణం నగలు ఏమయ్యాయని నిలదీశారు. అంతా కిమిన్నాస్తి, భోషాణం నగలూ బొక్కేసి రొండి చెయ్యి చూపించి ఒక్క బంగారు గొలుసు మాత్రమే చేతిలో పెట్టి పంపించేశారు. ఇలా తాడికొండ బంగారుకొండ బంగారు భోగం చేజారిపోయింది.

బాబాయిల పెంపకంలో విద్య

మల్లికార్జునరావు గారి బాబాయిలు శ్రీ తాడికొండ నాగేశ్వరరావు, శ్రీ కామేశ్వరరావులు అన్నగారబ్బాయిని తమకున్న పరిమిత ఆర్థిక వనరులతో పెంచి

విద్యాబుద్ధులు నేర్పించారు. విజయవాడలోని కృష్ణలంకలో పెద్దగా భూ వసతి కాని, మంచి గృహం కాని ఆర్థిక వనరులు కాని వారికి అప్పుడేమీ లేవు. కష్టపడి ఇష్టపడి సాకారు, పెంచారు. వీరిలో హోమియో వైద్యంలో ప్రముఖులైన శ్రీ కామేశ్వరరావుగారు అన్న కుమారుని చాల ఆత్మీయంగా పెంచారు. ఆనాటి హోమియో వైద్యులలో కామేశ్వరరావు గారికి గొప్ప డాక్టర్‌గా పేరుండేది. ఆయన పేరు తెలియని వారుండేవారు కాదు. హైస్కూల్ చదువు విజయవాడ గాంధీజీ మునిసిపల్ స్కూల్‌లో పూర్తిచేసి, ఎస్.ఎస్.ఎల్.సి పాసై, తర్వాత పి.యు.సి చదివి పాసైనారు. ఇంతవరకే చదువు కొనసాగింది. దీనితో ఆనాడు ఏ ఉద్యోగమూ రాదని గ్రహించారు.

బాబాయి ఆదర్శంతో హోమియో డాక్టర్

బాబాయిలాగా తానూ హోమియో డాక్టర్ అవ్వాలని కోరిక కలిగి హోమియోలో డిప్లమో చేశారు. మందులపై పూర్తి అవగాహన పెంచుకొన్నారు. కొత్తగా వచ్చిన రోగాలకు తగిన మందులు వాడటం ప్రారంభించి, కృష్ణలంకలోని స్వంత ఇంట్లో అంటే తాటాకు పాకలోనే హోమియో క్లినిక్ ప్రారంభించి 15 సంవత్సరాలు ప్రాక్టీస్ చేసి విజయవాడలో ప్రముఖ హోమిమో డాక్టర్‌గా "బాబాయిని మించిన అబ్బాయ్"గా పేరు పొంది, పట్టణ ప్రముఖులలో ఒకరుగా డాక్టర్ మల్లికార్జునరావుగా ప్రఖ్యాతులయ్యారు. ఎక్కడెక్కడి నుంచో వ్యాధిగ్రస్తులు వచ్చి వీరితో చికిత్స చేయించుకొని పూర్తిగా స్వస్థత పొంది సంతృప్తి చెందేవారు. వీరి హస్త వాసి చాలా మంచిది అనే ఖ్యాతి వచ్చింది. మొండి రోగాలను అతి సునాయాసంగా నయం చేసేవారు. ఇతర దేశాల నుండి నాణ్యమైన హోమిమో మందులను తెప్పించి వాడటం వీరి ప్రత్యేకత.

వివాహం– పుస్తకాల షాపు

17వ ఏట కృష్ణాజిల్లా పమిడిముక్కల గ్రామంలోని శ్రీ మల్లంపల్లి దక్షిణామూర్తి, శ్రీమతివెర్రెమ్మల కుమార్తె, శ్రీమతి బాలా త్రిపుర సుందరి లలిత

కుమారిని వివాహ మాడారు. ఈ వివాహంతో వీరి జాతకమే మారిపోయింది. వీరిద్దరి అన్యోన్య దాంపత్యం ఎన్నో శుభాలనిచ్చింది. శ్రీమతి లలిత గారు శ్రీ మల్లికార్జునరావు గారి హృదయాన్నెరిగి ప్రవర్తిస్తూ బంధు మిత్రులకు, అతిథి అభ్యాగతులకు సాక్షాత్తు ఆ "అన్నపూర్ణాదేవి"గా గుర్తింపు పొందారు. సఫల మనోరథులయ్యారు. వీరి దాంపత్యం అందరికీఆదర్శప్రాయమై నిలిచింది. మల్లికార్జునరావు గారు విజయవాడ అలంకార్ టాకీస్ సెంటర్‌లో "శ్రీ శైలనాథ బుక్ స్టోర్స్" స్థాపించి పదేళ్ళు దిగ్విజయంగా నడిపి రోజుకు పదివేల రూపాయల అమ్మకాలు చేసీ, ఎక్కడా దొరకని అరుదైన పుస్తకాలు తెప్పించి అమ్మి, అందరికీ షాపును అందుబాటులోకి తెచ్చారు. డబ్బు వెనకేసుకో గలిగారు. ఇదంతా తమ అలవేలుపు ఆ శ్రీశైల మల్లికార్జున స్వామి కృపా కటాక్షం అనేవారు.

ఆధ్యాత్మిక ఔన్నత్యం– వాస్తు జ్యోతిషాలలో పాండిత్యం

అనుకోకుండా అకస్మాత్తుగా భగవత్ కృప వలన, కనకదుర్గమ్మ అనుగ్రహం వలన మల్లికార్జునరావు గారికి ఆత్మజ్ఞానం కలిగింది. ఆధ్యాత్మిక ఔన్నత్యం లభించింది. ఇంటిలో శివార్చన అభిషేకాలు నిత్యం చేసేవారు. అమ్మవారి పీఠం పెట్టి శ్రద్ధగా పూజించేవారు. దీనివలన వశ్య వాక్కు ఏర్పడింది. నోటి వెంబడి ఏది వస్తే, చెబితే అది జరిగేది. ఇదంతా "అమ్మ అనుగ్రహం"గా భావించారు. గొప్ప సిద్ధాంతిగా గుర్తింపు వచ్చింది. జ్యోతిషంలో అపార పాండిత్యం అలవడి జ్యోతిశ్శాస్త్రవేత్త అయ్యారు. వాస్తుశాస్త్ర లోతులను తరచి మహా వాస్తువేత్త అనిపించుకొన్నారు. జాతకాలు, మంచి చెడు చెప్పటం, ఇంటి ప్లానులు, వాస్తు దోష నివారణలతో డాక్టర్ బాబు మరీ బిజీ అయిపోయారు.

మళ్ళీ అందుకొన్న భోగ వైభోగాలు

ఆనాడు బెజవాడలో వాస్తు, జ్యోతిషాలలో వీరికి మించినవారు లేరనిపించారు. వందలాది శుభ ముహూర్తాలు పెట్టారు. ఎక్కడెక్కడి నుండో జనం వచ్చి వీరితో అన్నీ చెప్పించుకొని హోమియో మందు వాడి జబ్బులు నయం

చేసుకొనేవారు. రాష్ట్రం అంతా మల్లికార్జునరావు గారి పేరు మారు మ్రోగింది. పేరు ప్రఖ్యాతలు బిరుదులూ గౌరవాలు మన్ననలు, సన్మానాలకు అంతే లేకుండా పోయింది. పట్టింది ముట్టిందీ బంగారమే అయింది. సినీ, రాజకీయ, వ్యాపార, వాణిజ్య, ఉద్యోగ వర్గాలవారు వీరింటి ముందు బారులు తీరేవారు. వీరితోనే ముహూర్తాలు పెట్టించి ఆ ముహూర్తానికి వీరితోనే కొబ్బరికాయ కొట్టించి తమపని విజయవంతం అవుతుందని విశ్వసించేవారు. అంతటి గౌరవ ప్రాభవాలు సాధించారు. మళ్ళీ "భోగ మల్లికార్జున" నామం సార్థకం చేసుకొన్నారు. అన్ని సౌకర్యాలతో రెండంతస్తుల మేడ కట్టుకొన్నారు. క్లినిక్‌కు, పేషంట్‌లకు వేర్వేరు గదులు ఏర్పాటు చేసుకొన్నారు. ఇదంతా స్వయం కృషి అయినా అమ్మవారి అనుగ్రహం వల్లనే జరిగిందని నమ్మేవారు. అదృష్టం ఇలా వారి వీధి తలుపు తట్టి లోపలికి ప్రవేశించింది. ఇక ఎదురూ తిరుగులేని జాతకులయ్యారు. విజయవాడ పట్టణంలో ఒక "సెలెబ్రిటీ" అయ్యారు మల్లికార్జునరావు గారు. వీరికి ఎప్పుడు ఏ అవసరం వస్తుందో అని పట్టణ ప్రముఖులు వీరి ఇంటిముందు కార్లు పెట్టి సిద్ధంగా ఉంచేవారు. దేనికీ కొదవ ఉండేదికాదు. ఎందరికో అనేక సంస్థలలో ఉద్యోగాలిప్పించి ఆదుకొని కుటుంబాలను నిలబెట్టారు. కూతుళ్ళకూ హోమియో వైద్యం నేర్పి తరిఫీదు నిచ్చారు.

మల్లికార్జున మూర్తిమత్వం

దబ్బ పండు ఛాయ, ఆజానుబాహుడు భారీ రూపం, పాలభాగాన తీర్చిదిద్దిన విభూతి రేఖలు, నుదుట యెర్ర కుంకుమ బొట్టు, మెడనిండా పెద్ద పెద్ద రుద్రాక్ష, స్ఫటిక మాలలు, మల్లెపూవులాంటి గ్లాస్కో పంచ, అంతే తెలుపు లాల్చీ, రెండు చేతుల వ్రేళ్ళ నిండా బంగారు ఉంగరాలు, మెడలోను చేతులకు బంగారు గొలుసులు, తెల్లని జరీ ఉత్తరీయంతో భోగ మల్లికార్జునరావుగారు నడిచే భోగ శ్రీశైల మల్లికార్జునేడే అనిపిస్తారు. నెమ్మదైన మాట, చిరునవ్వుతో పలకరించే ఆత్మీయ పరామర్శ, డాబూ దర్పంలేని బోళా శంరుడనిపిస్తారు. మాట్లాడేటప్పుడే అవతలి వాడి ఆంతర్యం అర్థం చేసుకొనే నేర్పు, ఆ చూపులో నిశిత పరిశీలనా

ఆయన ప్రత్యేకతలు. ఒక్కమాటలో చెప్పాలంటే పరేంగితావ గాహి మల్లికార్జునరావు గారు.

దేవాలయ ధర్మకర్త

వీరి దైవభక్తి, ఆధ్యాత్మిక స్థాయి ప్రజా సేవలను గుర్తించి ప్రభుత్వం శ్రీ మల్లికార్జునరావు గారిని శ్రీ కనకదుర్గ దేవాలయానికి, మాచవరం శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి, సీతానగరం శ్రీ సీతారామ దేవాలయానికి ధర్మకర్తలుగా నియమించి గౌరవించింది. ఆ ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ప్రజలలో అస్తికత్వ వ్యాప్తికి అంతులేని కృషి చేశారు.

సినీ ముహూర్తాలు

వీరితో ముహూర్తం పెట్టించి కొబ్బరికాయ కొట్టించిన అనేక సినిమాలలో కలిసొచ్చిన అదృష్టం, నిండు మనసులు, నిండు హృదయాలు, జగదేక వీరుడు అతిలోక సుందరి, శ్రీ కృష్ణావతారం, డబ్బుకు లోకం దాసోహం, అత్తగారూ కొత్త కోడలు... వంటి సూపర్ డూపర్ హిట్ సినిమాలెన్నో ఉన్నాయి.

బారులు తీరిన నాయకులు

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ శ్రీ చినజీయర్ స్వామి, భారత మాజీ ప్రధానులు శ్రీ వాజ్‌పాయి, శ్రీ పి.వి.నరసింహారావు,మాజీ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, కార్మిక నాయకులు శాసన సభ్యులు శ్రీ పి.జనార్ధనరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి, ప్రఖ్యాత సినీ నటుడు ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు, ప్రముఖ నటులు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీ చిరంజీవి, ప్రముఖ వైద్యులు విజయవాడ ఛైర్మన్ శ్రీ టి.వి.చలపతిరావు, శ్రీ జంధ్యాల శంకర్ వంటి ఎందరో ప్రముఖులు తమ ఆధ్యాత్మిక గురువులు శ్రీ మల్లికార్జునరావు గారింటికి వచ్చి ఆతిథ్యం పొంది, సంతృప్తి పొందారు. ఎందరొచ్చినా అందరికీ వండి వడ్డించి కడుపు నిండుగా భోజనం పెట్టి సత్కరించి పంపేవారు భార్య బాలా త్రిపుర సుందరి గారు. వీ రిల్లు ఎప్పుడూ బంధు మిత్రులతో, అభిమానులతో పెళ్ళి ఇల్లులాగా కళకళలాడేది.

నిత్య కల్యాణం పచ్చతోరణంగా వెలిగేది.

ఆత్మీయ బంధువర్గం

మల్లికార్జునరావు గారి బంధువర్గంలో చాలామంది ప్రముఖులున్నారు. అందులో ముందే చెప్పిట్లు చలన చిత్ర దర్శకులు శ్రీ కే.విశ్వనాధ్ వీరి మేనత్త శ్రీమతి సరస్వతి గారి కుమారుడే. వీరింటిలో అన్ని శుభకార్యాలకూ విశ్వనాధ్ దంపతులు హాజరవటం ఆనవాయితీ. ప్రముఖ గాయకుడు శ్రీ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్.పి), ఆయన చెల్లెలు ప్రసిద్ధ గాయని శ్రీమతి శైలజల తండ్రి శ్రీ మల్లికార్జురావు గారి పిన్ని కుమారులే. అంటే మల్లికార్జునరావుగారి తల్లిగారు, బాలు గారి తండ్రి శ్రీ సాంబమూర్తిగారి తల్లీ స్వయానా అక్కా చెల్లెళ్ళు. అలాగే ప్రముఖ నటుడు, పడిమిముక్కల నివాసి శ్రీ చంద్రమోహన్, శ్రీమతి బాలా త్రిపుర సుందరి గారి పెదనాన్న కుమారుడే. ప్రముఖ కథా రచయిత శ్రీ సింగరాజు రామచంద్రమూర్తి గారి తల్లి మల్లికార్జునరావు గారికి పెద్ద మేనత్త కుమారుడైతే, శ్రీ విశ్వనాధ్ చిన్న మేనత్త కుమారుడు అంటే విశ్వనాధ్ "సి.రా'లు అక్కా చెల్లెళ్ళ పిల్లలే. వీరంతా వీరింటి కార్యాలకు తప్పక వచ్చేవారు. ఇల్లంతా సందడే సందడి. ప్రముఖ కథారచయిత న్యాయవాది శ్రీ కాటూరి రవీంద్ర త్రివిక్రమ్ గారు వీరి పెద్దల్లుడు శ్రీ సీతంరాజు వెంకటరావు గారి సోదరి భర్త.

సంతానం

తాను తన ఒక్కగానొక్క కొడుకు అయినందున అచ్చటా ముచ్చట తీరలేదని, కూతుళ్ళు కొడుకులతో ఇల్లు కళకళలాడేట్లు చేయాలని భావించి ఆ సంతృప్తిని అనుభవించాలని భావించి, ఈ జంట ఒకే ఒక కుమారుడికి అయిదుగురు కుమార్తెలకు జన్మనిచ్చారు. వీరి పెద్దఉమార్తె శ్రీమతి మల్లికకు మదిరపాడు గ్రామస్తులు శ్రీ సీతంరాజు వెంకటరావు గారికిచ్చి వివాహం చేశారు. వీరి పెద్దకుమార్తె శ్రీమతి జయలక్ష్మిని గుంటూరుకు చెందిన శ్రీ ఎల్లాప్రగడ శ్రీ సత్యమూర్తి శ్రీమతి సుబ్బలక్ష్మి దంపతుల కుమారుడు సుబ్రహ్మణ్యం గారికిచ్చి వివాహం చేశారు.

వీరి కుమార్తె ఐశ్వర్య, కుమారుడు భరద్వాజ, వీరి కుమారుడు శ్రీ మోహన మల్లికార్జున్‌కు తిరుపతికి చెందిన శ్రీ బొడ్డపాటి దాశరథి, శ్రీమతి రాజ రాజేశ్వరిల కుమార్తె శ్రీమతి హరిప్రియనిచ్చి వివాహం చేశారు. వీరి ఏకైక పుత్ర సంతానం చి॥ జితేంద్ర. చిన్న కుమార్తె శ్రీమతి కనకదుర్గను మచిలీపట్నానికి చెందిన శ్రీ మల్లపల్లి ప్రసాదరావు, శ్రీమతి లలితగార్ల కుమారుడు శ్రీ భానుప్రసాద్ కిచ్చి పెళ్ళి చేశారు. వీరి సంతానం చి॥ చిన్ని కృష్ణ, మీనాక్షి.

మల్లికార్జునరావు గారి రెండవ సంతానం కుమారుడైన శ్రీనివాస సుబ్రహ్మణ్య మల్లికార్జున్ ఎం.ఏ చదివి ఆంధ్రాబ్యాంక్‌లో ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. "అయ్యగారి" వారింటి ఆడపడుచు శ్రీమతి భారతినిచ్చి వివాహం చేశారు. వీరి కుమార్తెలు చి॥ వైష్ణవి, పద్మిని, లలితలు. రెండవ కుమార్తె శ్రీమతి పార్వతిని గుంటూరు వాస్తవ్యులు శ్రీ కామరాజు శ్రీరంగనాథమూర్తి కిచ్చి వివాహం జరిపించారు. వీరి సంతానం కందన్ కృష్ణ, నారాయణ. నాలుగవ కుమార్తె శ్రీమతి కల్యాణిని గుంటూరుకు చెందిన శ్రీ "సీతిరాజు" శ్రీరామచంద్ర కుమార్ కిచ్చి వివాహం చేశారు. వీరి కుమారులు చందన్, ప్రణవ్. అయిదవ కుమార్తె శ్రీమతి కామేశ్వరిని నెల్లూరు నివాసి శ్రీ కాకర్ల రాధాకృష్ణకిచ్చి కల్యాణం చేశారు. వీరి కుమారులే సుమంత్, సంపత్‌లు.

ఇల్లే ఆనంద బృందావనం

కుమారుడి, కుమార్తెల వివాహాలను యోగ్యులైన తగిన వారికిచ్చి వివాహం చేసి బాధ్యతలన్నీ నెరవేర్చుకున్నారు. అల్లుళ్ళు, కోడళ్ళు, మనవళ్ళు, మనవరాళ్ళతో ఇల్లంతా "ఆనంద బృందావనం"గా వర్ధిల్లజేశారు. అందరి బాబోగులు చూసేవారు. కొడుకంటే విపరీతమైన అభిమానం. కోడల్ని కూతురుగానే చూసిన సంస్కారం ఆయనది. కుమార్తెలు అల్లుళ్ళు అంటే అమితమైన ఆదరణ. ముఖ్యంగా పెద్దకూతురు శ్రీమతి మల్లిక గారంటే ఇద్దరికీ అమితమైన ఆప్యాయత. ప్రతి పండగకూ వీరంతా రావాల్సిందే. అందరికీ నూతన వస్త్రాలు, షడ్రసోపేత భోజనాలు పెట్టి సంతోష పడేవారు. సంతానం ఆనందమే తమ ఆనందంగా శ్రీ మల్లికార్జునరావు దంపతులు సంబరపడే వారు. అదే వారిద్దరికీ సంతృప్తి, సంతోషం,

ఆనందం. ఇప్పుడు ఆ దంపతుల కళ్ళనిండా ఎంతో సంతృప్తి, మనసు నిండా ఆనందం వెల్లివిరిసి ధన్యజీవులమయ్యామని పరమానందం పొందేవారు.

స్ఫూర్తి మత్వం

తన జీవిత చరిత్రను డైరీలో రాసి, అప్పుడప్పుడు పిల్లలకు చదివి వినిపించి, తాను ఎంతటి కష్టాల కడలిని ఈది, బాధలూ వేదనలూ అనుభవించి ఇప్పుడున్న స్థితికి చేరుకొన్నారో తెలియజేసేవారు. కష్టపడితేనే పైకి రాగలమని అనుభవ పూర్వకంగా తెలియజెప్పేవారు. ఆయన అందరికి స్ఫూర్తినిచ్చారని వారి సంతానం భావించింది. అమ్మా నాన్నల ఆప్యాయతను అధికంగా అందుకొని వారి సంతానం తలిదండ్రుల కను సన్నలలో మెలుగుతూ, పెద్దరికం ఇస్తూ అన్యోన్యంగా వర్థిల్లారు. సంతానమంతా తల్లిదండ్రుల ఆదర్శాలకు అనుగుణంగా ప్రవర్తించి మానసిక ప్రశాంతిని కలిగించారు.

ద్వయం శివైక్యం

ఇలా అందరిలో పెద్దగా ఉంటూ తోచిన సహాయం చేస్తూ, సంఘంలో గౌరవ స్థానాన్ని పొంది, సుఖ సంతోసాలతో 62 ఏళ్ళు ఆరోగ్యంగా జీవించి 1998లో 62వ ఏట శ్రీ భోగ మల్లికార్జునరావు గారు "శివైక్యభోగం" పొందారు. భార్య శ్రీమతి బాలా త్రిపుర సుందరి గారు తండ్రిలేని లోటు పిల్లలకు కలుగకుండా అదే ఆప్యాయతను పంచుతూ అందరి ఆలనా పాలనా చూశారు. భక్తీశ్రద్ధలతో శ్రీ లలితాదేవి ధ్యానంతో పూజాదికాలతో అనుక్షణం జీవించారు. 2015 నవంబర్‌లో ఇంట్లోనే కార్తీక మాసంలో శివునికి మహన్యాస పూర్వక అభిషేకం చేయించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించి, భోజనం చేసి విశ్రాంతిగా పడుకొని సునాయాసంగా తాను నమ్మిన ఆ "లలితాదేవి సామీప్యాన్ని" పొందారు శ్రీమతి బాలా త్రిపుర సుందరి గారు. అందుకే సాత్విక సంపన్నులైన ఆ పుణ్య దంపతులకు "మా అన్నయ్య" ఆత్మీయ కవితా స్రవంతిని వారి పెద్ద కుమార్తె, సరసభారతి కార్యవర్గ సభ్యురాలు, ఈ పుస్తకానికి స్పాన్సర్ అయిన శ్రీమతి మల్లిక గారి కోరికపై అంకితమిచ్చి సార్థకత కల్పిస్తున్నాం.

"మా అన్నయ్య" కవితా స్రవంతి ప్రాయోజకురాలు శ్రీమతి సీతంరాజు మల్లిక

"మ**ల్లి**కాంబ" అని మా కుటుంబం అందరిచేతా ఆప్యాయంగా పిలువబడే శ్రీమతి సీతంరాజు మల్లిక గారు ఎప్పుడో 30 ఏళ్ళ క్రితం ఒక ఏడాది తమ కుటుంబంతో మా పెంకుటింట్లో కాపురమున్నారు. భర్త శ్రీ వెంకటరావుగారు ఎలక్ట్రిసిటీ బోర్డ్‌లో ఉద్యోగి. బహు నెమ్మది మనిషి. అందరికి తలలో నాలుకగా ఉండేవారిద్దరూ. అప్పటి నుంచి ఆ కుటుంబానికి మా కుటుంబానికి ఆత్మీయ అనుబంధం ఏర్పడింది. మల్లికగారిని మాకు అనునిత్యం కనిపించే "ఆడపడచు"గా మేము భావిస్తాం. అలాగే శ్రీ అయినపర్తి రాంబాబు గారి భార్య శ్రీమతి భవాని గారు కూడా మా "ఆడపడుచే" అంటాం. వీరిద్దరు మా శ్రీమతి ప్రభావతికి అంతరంగిక స్నేహితులు. "ఫ్యామిలీ ఫ్రెండ్స్" మాత్రమే కాక సరసభారతి అభిమానులు కూడా. తరుచు మా ఇంటికి వారు, వారింటికి మేము వెళ్ళటం జరుగుతూనే ఉంది.

మా ఇంట్లో జరిగే శుభకార్యాలన్నిటికీ మల్లికగారు, భవానిగారు తప్పక వస్తారు. అలాగే వారిద్దరి ఇంటి కార్యాలకు మేమూ వెడుతూనే ఉంటాం. సాహిత్యం అన్నా సంగీతం అన్నా మల్లిక గారికి విపరీతమైన అభిమానం. మాతోపాటు కేరళ టూర్‌లో పాల్గొని మాకెంతో సహాయం చేశారు. కోటప్పకొండ, త్రిపురాంతకం సందర్శనలోనూ మాతో ఉన్నారు. మా ఇంట్లో ఏదైనా కార్యం తలబడితే వెంటనే వచ్చి వాలిపోయి మా శ్రీమతికి అన్నివిధాలా సహాయం చేస్తారు మల్లికగారు. సాహిత్య కార్యక్రమాలకు అతిథులను ఆహ్వానిస్తే వారికి భోజనం మా ఇంట్లో ఏర్పాటుచేస్తే ముందుగా మల్లిక గారికి తెలియజేస్తాం. ఆమె వస్తే మాకు గొప్ప అండగా ఉంటారు. కార్యక్రమం హాయిగా జరిగిపోయినట్లే లెక్క. అలాగే కార్తీక పౌర్ణమినాడు మా పెరటి ఉసిరి చెట్టు కింద చేసుకొనే అభిషేకం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలకు ఆమె తప్పక హాజరై తాను కూడా ఒకటో రెండో పదార్థాలు చేసి తెచ్చి వడ్డించి సరదాగా గడిపే గొప్ప లక్షణం ఆమెది. మా పిల్లలందరూ ఆమెను

"మల్లికాంబ గారూ" అని ఆప్యాయంగా పిలుస్తారు. అందులో మా అమ్మాయి చి।సౌ। విజయలక్ష్మికి అమెరికాలో ఉన్నా మల్లిక గారి సంగతుల్ని ప్రత్యేకంగా అడిగి తెలుసుకొంటుంది. కుమార్తెలను "జయాం" "దుర్గాలు" అని ప్రేమగా పిలుచుకొంటారు. పెద్దకుమార్తె శ్రీమతి జయలక్ష్మిని గుంటూరు వాసి శ్రీ యల్లాప్రగడ సుబ్రహ్మణ్యం గారికిచ్చి వివాహం జరిపించారు. వీరికి ఐశ్వర్య, భరద్వాజ సంతానం. కొద్ది కాలానికే మల్లిక గారి భర్త వెంటకరావు గారు అకస్మాత్తుగా మరణించారు. ఆయన చేసే ఉద్యోగంలో కుమారుడు మోహన్‌ను బోర్డ్‌వారు నియమించారు. భర్త మరణానంతరం మల్లిక గారు కుటుంబ బాధ్యతను తీసుకొని చిన్నమ్మాయి చి। కనకదుర్గను మచిలీపట్నం వాస్తవ్యులు శ్రీ మల్లంపల్లి భాను ప్రసాద్‌కిచ్చి పెళ్ళి చేశారు. వీరికి చిన్ని కృష్ణ, మీనాక్షి సంతానం. కుమారుడు చి। మోహన మల్లికార్జున్‌కు తిరుపతిలో ఉంటున్న శ్రీమతి హరిప్రియనిచ్చి వివాహం జరిపించారు. వీరికి చి। జితేంద్ర ఏకైక పుత్రరత్నం, వంశోద్ధారకుడు. మంచి అల్లుళ్ళు దొరకటం మల్లికగారి అదృష్టం. ఉయ్యూరులో స్వగృహం కూడా నిర్మించుకొన్నారు. ఇద్దరు కూతుళ్ళు ఇద్దరు అల్లుళ్ళు కూడా గొప్ప సంస్కారవంతులు, కలుపుగోలుతనం ఉన్నవారు. కుమారుడు మోహన్ కూడా తల్లి మాట జవదాటని వాడు. కోడలు కూడా అనుకూలవతి. మా అందరితోనూ చాలా ఆత్మీయంగా మసిలే కుర్రాడు మోహన్.

మల్లికగారు ఇంట్లో నిత్యం పూజ చేసుకోనిది బయటికి అడుగు పెట్టరు. సోమవారం శివాలయం, గంళవారం శ్రీ సువర్చలాంజనేయస్వామి దేవాలయం, గురువారం శ్రీ సాయిబాబా గుడి, శుక్రవారం విష్ణ్వాలయం సందర్శించి పూజలు చేయిస్తారు. కార్తీక మాసంలో ఇంట్లో అభిషేకం చేయించి మాలాంటి అతిథులకు భోజనం పెట్టి బట్టలు పెట్టి ఆనందిస్తారు. మల్లికగారి స్నేహబృందం అపరిమితం. శ్రీ లలితా, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ బృందంలో ఆమె ముఖ్య సభ్యులు.

విశ్వనాధపై ఆయన స్వగ్రామం నందమూరులో తండ్రి కట్టించిన శివాలయంలో సరసభారతి కార్యక్రమం నిర్వహించినప్పుడు మాతో పాల్గొని ఎంతో సంబరపడ్డారు మల్లికగారు. ఆ ప్రక్కనే వారి అత్తవారి ఊరు మధిరపాడు ఉంది. మాతోపాటు చిన్న తిరుపతి అనే ద్వారకా తిరుమల వచ్చి స్వామి దర్శనం చేసేవారు. అక్కడ పైన ఉన్న శివాలయం ఉందని చెప్పి తీసుకొని వెళ్ళి దర్శనం చేయించారు. అప్పటిదాకా ఎన్నోసార్లు వెళ్ళినా మాకు తెలియనే తెలియదు. తిరుగు ప్రయాణంలో

మా రామారావుగారు గూడెం ఆగ్రహారానికి మాతోపాటు వచ్చి అక్కడ మా స్థలంలో నిర్మింపబడిన శ్రీ భక్తాంజనేయ స్వామిని దర్శించారు. విపరీతమైన భక్తీ ఆమెది. దాదాపు అన్ని క్షేత్రాలను సందర్శించిన పుణ్యమూర్తి ఆమె. ఇంటికి ఎప్పుడూ ఎవరో ఒక అతిథి వస్తూనే ఉంటారు. ఎందరెందరికో ఆర్థిక సహాయం చేశారు, చేస్తున్నారు. అందరికి తలలో నాలుకగా ఉంటూ ఆర్థికాది సహాయ సహకారాలు అందజేయటం ఆమెకు ఎంతో ఇష్టం.

"మా అన్నయ్య" ఆత్మీయ కవిసమ్మేళనాన్ని ఆస్వాదించి ఆ కవితలను పుస్తకరూపంలో తెస్తే, తాను స్పాన్సర్‌గా ఉంటానని తమ తలిదండ్రులు స్వర్గీయ శ్రీ తాడికొండ భోగ మల్లికార్జునరావు శ్రీమతి బాలా త్రిపుర సుందరి లలితకుమారి దంపతులకు అంకితమిచ్చి తలిదండ్రుల ఋణం తీర్చుకోవాలను కొంటున్నానని తెలియజేశారు. వారి సహృదయ స్పందనకు ఆనాడే సభాముఖంగా అభినందనలు తెలియజేశాం. ఇలా చేయటం తమకు తమ కుటుంబానికి దక్కిన గొప్ప అదృష్టం, గౌరవం అని ఆమె అభిప్రాయపడ్డారు. శ్రీమతి మల్లిక గారి సౌజన్యానికి మరొక మారు ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఇది సరసభారతి ప్రచురిస్తున్న 21వ పుస్తకం కావటం విశేషం.

సరసభారతి 22వ సమావేశంగా 27-3-2011న నిర్వహించిన శ్రీఖర నామ సంవత్సర ఉగాది వేడుకలలో "మా అక్కయ్య"పై అనురాగ కవిసమ్మేళనం నిర్వహించి, 28-8-2011న 28వ సమావేశంలో "మా అక్కయ్య" "అనురాగ కవితా సంపుటిని" ఆవిష్కరించిన విషయం, దీనికి స్ఫూర్తి శ్రీ వసుధ బసవేశ్వరరావు అన్న సంగతి మీ అందరికీ గుర్తుండే ఉండి ఉంటుంది. శ్రీ దుర్ముఖి నామ సంవత్సర ఉగాది వేడుకలను 3-4-2016న 90వ సమావేశంగా నిర్వహిస్తూ "మా అన్నయ్య"పై ఆత్మీయ కవిసమ్మేళనం నిర్వహించి, ఈనాడు ఆవిష్కరించడం ఆనందంగా ఉంది. దీనికి స్ఫూర్తి శ్రీ చలపాక ప్రకాష్ అని అందరికీ తెలుసు. ఇలా అనురాగమూర్తి అక్కయ్యపై, ఆత్మీయ స్ఫూర్తి అన్నయ్యపై కవిసమ్మేళనం నిర్వహించి, రెండిటిని పుస్తకరూపంలో అందించటం సరసభారతికి దక్కిన గొప్ప అదృష్టం. ఎవరూ చెయ్యని సాహసం ఇది. ఈ రెండిటిని విజయవంతం చేసిన కవి మిత్రులకు, సాహిత్యాభిమానులకు అభినందన చందనం.

- గబ్బిట దుర్గాప్రసాద్

ముందుమాట

'అన్నయ్య'పై మమకారాన్ని కురిపించిన కవితా సంకలనం.

– చలపాక ప్రకాష్,
సంపాదకుడు, రమ్యభారతి

ఉమ్మడి కుటుంబ వ్యవవస్థలో తల్లిదండ్రుల తర్వాత అన్నయ్య, అక్కయ్య పాత్రలే కీలకం. ఆ కాలంలో పది, పదిహేను మంది సంతానాలు కలిగుండేవి. వాళ్ళల్లో ఇంటికి పెద్దకుమారుడో, పెద్దకుమార్తో ఆ ఇంట్లో తలిదండ్రుల తర్వాత ప్రధాన పాత్ర పోషిస్తూ అందరికి చేయూతనిచ్చి అండగా నిలబడేవాళ్ళు. కాని మారుతున్న కాలంలో ఏర్పడ్డ పరిణామాల వల్ల కుటుంబం అంటే 'మేమిద్దరం–మాకిద్దరు' అన్న ప్రభుత్వ ఫ్యామిలీ ప్లానింగ్‌లో కుంచించుకు పోయింది. ఉన్న ఇద్దరు పిల్లల్లో చాలా వరకు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి అనే ధోరణిలో కనడం, ఆ తర్వాత తమ జీవిత కాలమంతా హాస్టల్లోనో, ఉద్యోగాలరీత్యా ఇతర ప్రాంతాల లోనో తరలిపోవడం వల్ల అన్నా చెల్లెళ్ళ మధ్య, అక్కా తమ్ముళ్ళ మధ్య అనుబంధాలు మృగ్యమయ్యే పరిస్థితుల్లో ఉంది నేటి సమాజం.

ఇక నా విషయానికొస్తే– నేనే ఇంటికి పెద్దకొడుకుని. నాకు అక్కలు లేరు–అన్నలూ లేరు కనుక, నాకు అన్నయ్య ఆదరణ, అక్క మమకారం రుచి చూడలేకపోయాను. నా తర్వాత ఇద్దరు చెల్లెళ్ళు, ఒక తమ్ముడూ ఉన్నారు. తమ్ముడు దగ్గర్లో ఉండటం వల్ల అనుకుంటా, తమ్ముడు కంటే దూరాన ఉన్న ఇద్దరి చెల్లెళ్ళపై మమకారం, ప్రేమాప్యాయతలు ఎక్కువగా ఉండేవి. కాని ఇది ప్రేమనలో, మమకారం అనాలో, అభిమానం అనాలో తెలుసుకోలేం. సాధారణంగా ఒక చెల్లో, తమ్ముడో వ్యక్తం చేసే అభిమానంకంటే, అది ఒక కవి గొంతుకతో వింటేనే ఆ మమకారాల రుచి, అభిమానాల శుచి మరింత ఎక్కువగా తెలుస్తుంది. ఇది ఎలా ఉంటుందో ఈ సంకలనంలో కవితలు చదివిన తర్వాతే నాకు మరింత తెలిసింది.. దుర్ముఖి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఉయ్యూరు 'సరసభారతి' వారు 'అన్నయ్య'పై కవిసమ్మేళనం సందర్భంలో ప్రచురిస్తున్న ఈ అన్నయ్య కవితా సంకలనం చదివిన తర్వాత 'అన్యయ్య బాధ్యతలేమిటో', అన్నయ్యపై తమ్ముళ్ళు, చెల్లెళ్ళ హృదయాంతరాలలో పెంచుకున్న అభిమానం, మమకారం ఏపాటివో అన్నగా చదివి మురిసిపోయాను. పులకించిపోయాను. కవితల స్థాయిలో

భేదాలున్నా, శైలిలో తారతమ్యాలున్నా, .స్థూలంగా 'అన్నయ్య'పై కవులు వ్యక్తం చేసిన అనేక కోణాలు ప్రస్ఫుటమయ్యి, ఈ కాలం యువతకు 'అన్న' బాధ్యతలను గుర్తుచేసి, వారిపై మరింత మమకారం పెంపొందించే దిశను ఈ సంకలనం కల్పిస్తుంది. ఈ విధంగా కుటుంబ వ్యవస్థకు కీలక బాధ్యతలు మోసే అన్న విలువను మరోసారి ఈ సమాజానికి ఉన్నత రీతిలో తెలియపరుస్తూ, కుటుంబ వ్యవస్థను పటిష్టపరిచే విధంగా ప్రేరేపిస్తున్న ఈ సంస్థ నిర్వహకులను, అధ్యక్షులు శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారిని అభినందించి తీరాలి.

– చలపాక ప్రకాష్

06-05-2016

'సరసభారతి' పుస్తక ప్రచురణకు

విరాళాలందించిన వదాన్యులకు కృతజ్ఞతలు

1. శ్రీమతి ఉష, శ్రీ రవి దంపతులు– అమెరికా– రూ.6,500/–
2. శ్రీ సుంకర కోటేశ్వరరావు, హైదరాబాద్ –రూ.5000/–
3. శ్రీ వేలూరి వివేకానంద్, శ్రీమతి దుర్గ దంపతులు– హైదరాబాద్ రూ.5000/–
4. కుమారి గుర్రాల శ్రీదేవి– ఉయ్యూరు– రూ.2,000/–
5 శ్రీ వణుకూరి సురేష్– ఉయ్యూరు– రూ.2,000/–
6. శ్రీ దుర్భాకుల వేంకట సుబ్రహ్మణ్యం, కొత్తగూడెం–రూ.1116/–
7. శ్రీ చిత్తజల్లు భవానీ శంకరరావు, శ్రీమతి పద్మశ్రీ దంపతులు, ఉయ్యూరు– రూ.1,116/–
8. శ్రీ గబ్బిట కాశీవిశ్వనాథ్, శ్రీమతి గీత దంపతులు– అమెరికా– రూ.1,008/–
9. శ్రీ గబ్బిట కృష్ణస్వామి, శ్రీమతి వెంకట సుబ్బలక్ష్మి దంపతులు– హైదరాబాద్– రూ.1,008/–
10. శ్రీ వేలూరి రామకృష్ణ, శ్రీమతి వేదవల్లి దంపతులు– గరివిడి– రూ.1000/–
11. శ్రీ గబ్బిట రామనాధ్‌బాబు, శ్రీమతి జయలక్ష్మి దంపతులు– ఉయ్యూరు– రూ.1,000/–
12. శ్రీమతి చతుర్వేదుల జానకి, విజయవాడ– రూ.500/–

ఉయ్యూరు విశిష్టత

– పంతుల వెంకటేశ్వరరావు, విజయవాడ

శా– ఉయ్యూరా! ఇది పండితుల్ కవులు నత్యుత్సాహ వంతుల్ సదా
నెయ్యంబున్ గడు ప్రేమ జూపు ఘనులున్, నిత్యంబు సాయంబులున్
చెయ్యందించెడువారు గల్గు పురి, యాక్షేపింప బోరెవ్వరున్
వెయ్యండికను పూల హారములు వైవిధ్యంబు కీర్తించు చున్

తే॥ పంచదార కర్మాగార బస్తి గాన– ఇచ్చట కవితలన్నియు ముచ్చటింప
నోలలాడించు నెప్పుడ సూయ బాపి– మధుర సుధలనిచ్చుచు మన
మానసంబు

తే॥ అతిథులన్ గౌరవిం చెడుయశము గల్గి– సంస్కృతీ సంప్రదాయముల్
శాశ్వత మయి
తగువు లాడక నిత్యము దయను పంచి– ధర్మ సత్యంబులను గల్గి
ధరణి యందు–
నెల్లెడల పొందు సత్కీర్తి యప్పురంబు

ఉ॥ అబ్బురమౌ విధంబునను హారములన్ తెలుగమ్మ కేయగన్
గబ్బిట వారు నిల్పిరిట ఖ్యాతిని పెంచగ సాహితీ సభన్
జబ్బలు గట్టిగా చరచి జట్టుగ సత్కవీశులన్
దెబ్బకు నాంగ్ల దెయ్యమును తెల్గున కైతలకున్ దిగెన్ గదా

సీ॥ ఎందరో నాయకు లెందరో గాయకు లెందరో సత్కవులిక్కడుండె
ఎందరో సజ్జను లెందరో పండితు లెందరో సంస్కారు లీడనుండె
ఎందరో అతిథులెందరో అభ్యాగతు లకీ పురంబును తోడు నిచ్చె
ఎందరో ఘనులకు నెందరో బుధులకు నిచ్చోట గౌరవంబెప్పుడుండె
అట్టి అలరారు ఉయ్యూరు ఆంధ్ర మందు–గొప్ప గ్రామమై వెలుగొంది
మెప్పు పొందు
స్థానికుల కెప్ప దివ్యమౌ స్థాన మిచ్చి– ఎల్ల వేళల సంరక్షించు నీ
యుగాది.

ఏ పుటలో.. ఎవరి కవిత..!

1. నా(అ)న్న - వసుధ బసవేశ్వరరావు 19
2. చిన్నన్నయ్య - డా॥ రాచకొండ నరసింహశర్మ 20
3. మా శర్మన్నయ్య చిరంజీవి -గబ్బిట దుర్గాప్రసాద్ 21
4. రామయ్యన్నయ్య - డా. వేదాంతం శ్రీధరాచార్యులు 22
5. అన్నయ్యకు స్వాగతం - మాదిరాజు బిందు వెంకట దత్తశ్రీ 23
6. దార్శనిక విక్రాంత కీర్తి అన్న - నవులూరు రమేష్‌బాబు 24
7. అన్నయ్య ప్రేమ - మాదిరాజు శ్రీనివాసశర్మ 26
8. కన్నయ్యే అన్నయ్య - మాదిరాజు శివలక్ష్మి 27
9. వీర బంధుడు అన్నయ్య -మైనేపల్లి సుబ్రహ్మణ్యం 28
10. అన్నయ్య మనసు నిర్మలం - శ్రీమతి పెళ్ళూరు శేషుకుమారి 29
11. ఆత్మీయ అనురాగ పుంభావమూర్తి అన్నయ్య - దండిభొట్ల దత్తాత్రేయశర్మ.....30
12. అనురాగపు కొండ అన్నయ్య - శ్రీమతి గుడిపూడి రాధికారాణి 31
13. రక్షా బంధనమే అన్నయ్య - శ్రీమతి మేరీ కృపాబాయి 32
14. అమ్మ అయ్యల కలగుపు అన్నయ్య - శ్రీమతి కందాళ జానకి 33
15. ఆత్మ బంధువు అన్న -శ్రీమతి వారణాసి సూర్యకుమారి 34
16. పుట్టింటి వేలుపు అన్న - శ్రీమతి ముదిగొండ సీతారావమ్మ 36
17. దేవుడి వరం అన్న - మునగంటి వెంకటాచార్యులు 38
18. అన్నయ్య అమల బంధం - శ్రీమతి సింహాద్రి వాణి 39
19. ఇష్ట దేవత అన్న - శ్రీమతి లక్కరాజు వాణీ సరోజిని 40
20. అరుదైన బ్రహ్మ కమలం అన్నయ్య - కందికొండ రవికిరణ్ 42
21. కష్టజీవి అన్నయ్య - శ్రీమతి కోనేరు కల్పన 43
22. మిన్నంటిన గౌరవం అన్న - పంతుల వెంకటేశ్వరరావు 45
23. మా (లక్ష్మీ) అన్న- అయ్య - శ్రీమతి కోమాండూరి కృష్ణ 47
24. అంతా నాకు దేవుడిచ్చిన అన్నయ్యలే - శ్రీమతి పద్మావతీ శర్మ 48
25. అనురాగమూర్తి అన్నయ్య- పాణిగ్రాహి రాజశేఖర్ 49
26. అన్నన్నా - పువ్వాడ తిక్కన సోమయాజి 50
27. అన్నయ్య పురుషోత్తముడు - తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు 52
28. అపర భగీరథుడు అన్నయ్య - శ్రీమతి వడ్డాది లక్ష్మీ సుభద్ర 54
29. మనసున్న మా అన్నయ్య - శ్రీమతి ఎన్.అన్నపూర్ణ 55
30. మా పల్లె ''కన్నయ్య'' అన్నయ్య - శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపుర సుందరి....56
31. మా అన్నయ్య - డా. రాచకొండ నరసింహశర్మ 57
32. మార్గదర్శి అన్నయ్య - మైనేని గోపాలకృష్ణ 59
33. అందరికన్నా నా అన్న మిన్న - చింతపల్లి వెంకట నారాయణ 60
34. అపురూప ఫలం 'అన్నయ్య' - శ్రీమతి కోపూరి పుష్పాదేవి 61
35. ఒక 'అన్న' అంతరంగం - చలపాక ప్రకాష్ 62

మా అన్నయ్య

1. నా(అ)న్న

- వసుధ బసవేశ్వరరావు,
వెంప 9490832787

చిన్నప్పుడు చీకట్లో నడుస్తూ- భయంతో "నాన్నా" అని అరిచా
"నీ వెనుక నేనున్నానులే పద" అన్నాడు నాన్న
కష్టాలవాకిట్లో నడుస్తూ- మళ్ళీ భయంతో- "నాన్నా" అని అరిచా
"నీ వెనుక నేనున్నా పద" అన్నాడిప్పుడు మా అన్న.

2. చిన్నన్నయ్య

– డా. రాచకొండ నరసింహశర్మ. ఎం.డి.
విశాఖపట్నం 0891-6671471

విశ్వమని మేము పిలుచు న– శ్వర కీర్తి యుతు నతి వినమ్రుని సు కదా
విశ్వములోన మహా రధు– విశ్వమును వలచిన వాని వినుతింప నగున్
ఈ రా.వి.శాస్త్రి కీరితి– ఏరాడను కొండ మించి ఎవరెస్టగుటన్
తీరాన నేను నిల్చితి– గారాబము మదిని నిండి కన్నీ రొలుకున్
నిరపరాధులైన నిరు పేదలనెపుడు– వాదించి విడి పించు వాద యుక్తి
"ఘన పారు"లను మించు దన ధారణా శక్తి– సాంప్రదాయము వీడి సాగు ముక్తి
శ్రమ జీవి సాదలను శ్రవణింప నాసక్తి– సిద్ధాంతములు దాటు స్నేహ శుద్ధి
తా నెరుంగక యుండి, తన లోన లీనమై– దాగి యుండిన గాధ ధైవ భక్తి
ధరను జరుగు చుండు అనేక దారుణముల– క్రందు దీన జనాళి ఆక్రందనలకు
ఎదను స్పందించు శక్తియు– ఇన్ని గూడి– "కథక చక్ర వర్తి" యితండు కాక యెట్లు?
షేక్సిపియర్ కాదులే, చేక్కోవుయును కాదు– కాళిదాసీతండు కాదు కాని
ప్రాచీన నూతన రచన లందీపాటి– ఉపమాన వైదగ్ద్య ముండు టరిది
నవ రసముల మహోర్ణవము లందీరీతి– ఉర్రూత లూగించు ఓజలేవి?
పాటకపు జనుల బాధల చిత్రించు– నితని కథా శిల్ప మెచట దొరకు?
కథలలో నవలల, నాటకమ్ము లందు– మంచి చెడ్డల భేదమ్ము మనకు నేర్పె
"ఉత్తరాంధ్రుల యాస" పెల్లుబుకు చుండు– యీతని అనన్య సాధ్యమౌ వ్రాత లందు.

3. మా శర్మన్నయ్య చిరంజీవి

– గబ్బిట దుర్గాప్రసాద్ 9989066375

అన్నయ్యంటే మాకందరికీ విపరీతమైన అభిమానం
తాను కాలుతూ వెలుగునిచ్చిన కొవ్వొత్తి మా అన్నయ్య
ఇంటికెప్పుడూ దూరంగానే ఉన్నా
మా ఇంటిల్లిపాది గుండెల్లో ఉండేవాడు
గాంధీ గారి "స్మోకింగ్" ఇంగ్లీష్ పాఠం
మా సావిట్లో చెమటలు కక్కుతూ వేసవిలో చెప్పటం
తాను "చైన్ స్మోకర్" అని మాకు తెలిసినా
మేమూ అన్నయ్యా చిరునవ్వులు చిందిస్తూ
వినటం చెప్పటం ఎప్పటికీ మర్చిపోలేను
అన్నయ్య కొన్న తాజ్‌మహల్ మార్బుల్ బొమ్మ
అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఇష్టమే
అన్నయ్య ఇంగ్లీష్ పరిజ్ఞానం సాటి వారిలో లేనేలేదని
తాడంకి హైస్కూల్ ఇంగీష్ డిబేటింగ్‌లో
ఎప్పుడూ అన్నయ్యే ఫస్ట్ అని
అన్నయ్య క్లాస్‌మేట్లు ఆ తర్వాతెప్పుడో చెబితేకాని అర్థం కాలేదు
గోర్కీ సాహిత్యమంతా దాచాడు మాకోసం
అమ్మ అంటే ప్రేమ, నాన్నంటే గౌరవ భయం
చెల్లెళ్లు అన్నా తమ్ముళ్ళన్నా అభిమాన ధనం
హోస్పేటలో పాతాళ భైరవి, మిస్సమ్మ
సినిమాలు నాకు చూపించి వాటిపై చక్కని విమర్శ చేసేవాడు
రైల్వేస్టేషన్‌లో అరగంటకో సారి అరకప్పు కాఫీ తాగుతూ, తాగిస్తూ
బియ్యపు గింజల పలువరుసలో చిరునవ్వు చిందించేవాడు
జి.ఎల్.శర్మగా అన్నయ్య సంతకం చెక్కు చెదరని జ్ఞాపకం నాకు
అకస్మాత్తుగా 32 ఏళ్ళకే గుండె ఆగి అన్నయ్య చనిపోతే
ఇల్లు శోక సముద్రమే అయింది
అన్నయ్య ఎప్పుడూ మా గుండెల్లో, స్మృతిలో చిరంజీవే.

4. రామయ్యన్నయ్య

– డా. వేదాంతం శ్రీధరాచార్యులు,
ఉయ్యూరు

శ్రీరాముడు ఆదర్శ అన్నయ్య
మనం అవ్వాలి రామానుజులం
రామయ్య రాజ్యమే అన్ని కాలాల ప్రభుతల ఆశయం
రామయ్యన్నయ్య అన్న మాట, నడిచిన బాట సర్వ శ్రేష్ఠం.

5. అన్నయ్యకు స్వాగతం

– కుమారి మాదిరాజు బిందు వెంకట దత్తశ్రీ

ఉయ్యూరు 9666020842

ఓ విలక్షణమైన ప్రేమ స్వరూపం అన్నయ్య
జీవిత ప్రయాణంలో ఓ తోడు అన్నయ్య
ఆడపిల్లలకు పుట్టింటి బలం అన్నయ్య
అమ్మానాన్నల అనురాగ రూపం అన్నయ్య
అందుకే మనం–
రామ లక్ష్మణులను, బలరామ కృష్ణులను
నేటికీ మరువలేకున్నాం
అలాంటి అన్నయ్యకు ప్రేమ పూర్వక స్వాగతం పలుకుతూ
చరిత్ర పుటల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొంటున్నది
సరసభారతి 'మా అన్నయ్య' కవి సమ్మేళనం
ఓ దుర్ముఖీ ! ఇంతమంది అన్నయ్యలను
కవితాపరంగా పరిచయం చేస్తున్న నీకు వందనం
నూతన తెలుగు ఏడాదినాడు అన్నా తమ్ముల అక్కా చెల్లెళ్ళ
అప్యాయ అనురాగాలు మరింత యినుమడించాలని
ముగురమ్మల మూలపుటమ్మను భక్తితో వేడుకొంటున్నా.

6. దార్శనిక విక్రాంత కీర్తి అన్న

– నవులూరి రమేష్‌బాబు,

ఉయ్యూరు 9704071079

తే.గీ॥ శ్రీమదాది గణేశుడు చిన్మహితుడు– సకల సౌభాగ్య సౌకర్య శతము సతము
సుంత సద్బుద్ధి సిద్ధింప జూచు చుండి– ఆదుకొనుట నందరికిని "పెద్దన్న" యగును
మత్త కోకిల– "అమ్మ" యన్ పద పూర్వ భాగము సర్ద వంతము జేయగా
"అమ్మహాత్ములు" "నాన్న"లోని పరార్ధ భాగము జేర్చుచున్
ఇమ్మహిన్ పదమేర్చె "అన్న"గ నెంత లెంతలొ నేర్పుగా
దిమ్మ దిర్గిన బ్రహ్మ బుర్రకు తేజ మెంతయు జారెగా.

ఉ– ముందున బుట్టి, యాతడు తమోంతక తేజుడు భానుడే యగున్
ముందుగ వచ్చు నట్టి కడు మోటగు కష్టములెల్ల తానె. యా
నందము తో భరించి, తదనంతర సంతతి కంతకంతకున్
సుందర సౌఖ్య మంది యిడు చొప్పున వర్తిలు, "అన్న" యన్నయే
మత్తకోకిల– అమ్మ నాన్నల యర్ధ దేహము లైన రెండు సగాలకున్
నమ్మకమ్మును రూప మిచ్చియు నాణ్యతన్ గలిగలించగా
తమ్ముగుర్రల పుణ్య మార్గము తప్ప కుండగ చూచుటన్
నెమ్మనమ్మున దైవ మట్టుల నిత్య పూజలు "నన్న"కే.

సీ– చిన్నతనమునుండి చేరువగా నుండి సకల సమస్యల చక్క దిద్దు
యుక్త వయసు నందు యోచన బెంచుచు, సలహాలనిచ్చుచు సాకు

చుండు
కౌమారమందు సకలమును తానుగా అడుగడుగున తానె ఆదుకొంచు
వృద్ధాప్యమున గూడ శ్రద్ధగా క్షేమమ్ము జూచు చుండెడునట్టి శుద్ధజీవి.

తే॥గీ॥ పాఠ్య భేదాలు లేని పాఠ మెట్లు స్వార్థమే లేక బాధ్యతల్ సక్రమ గతి
పూర్తి చేసెడు సంపూజ్య పుణ్యుడతడు, తమ్ము గుర్రల "కన్నయ్య"
దార్శనికుడు
ఆదరాత్మీయతా పూర్ణ వార్ధి అన్న సుందరానురాగ ప్రభావ స్ఫూర్తి
అన్న
దివ్య తేజంబు వెదజల్లు దీప్తి అన్న– ఆర్తి పోకార్చు విక్రాంత కీర్తి
అన్న.

7. అన్నయ్య ప్రేమ

– మాదిరాజు శ్రీనివాసశర్మ, ఉయ్యూరు

9666020842

అన్నయ్యంటే నాకిష్టం– మా అన్నయ్యంటే నాకెంతో ఇష్టం
ఈ ఇష్టం ఇప్పటిదికాదు– ఎప్పటిదో
బ్రతుకు పొరల్లో కలిసి తిరిగిన జ్ఞాపకాలు
అమాయక జీవితంలో సమర్థతా సామర్థ్యాలను పెంచినవాడు
ఎందుకు వెళ్ళానో గుర్తులేదు కాని
చెంప చెళ్ళుమనిపిస్తే ఏడుస్తూ వెళ్ళిపోయిన నాకోసం
సైకిల్‌పై నా వెనుకే వచ్చి "ఎందుకొచ్చావురా?" అని
బుజ్జగించిన సంగతి నేనెన్నడూ మరవనే లేదు
తల నిమిరిన ఆ చేయి అమృత హస్తమే అనిపించింది
మా అన్నయ్య ప్రేమ కొండంత
గగనాంతపు రోదసిలో విహరిస్తున్న
మా అన్నయ్యే ఎప్పటికీ నాకు తోడూ నీడ.

8. కన్నయ్యే అన్నయ్య

– శ్రీమతి మాదిరాజు శివలక్ష్మి,
ఉయ్యూరు 9395379582

సుభద్రకు ప్రత్యక్షంగా, మనకు పరోక్షంగా
అన్న ప్రేమను పంచిన ఆ కన్నయ్యే మన అన్నయ్య
నేను సైతం అంటూ ఓ భరోసా ఇస్తూ
ఆ బంధాన్ని రాఖీతో పెనవేసిన వాడే మన అన్నయ్య!
ఆడపిల్ల ఆడ ఉన్నా, ఈడ ఉన్నా నేనున్నానంటూ
అమావాస్య పండక్కి (దీపావళి) పుట్టింటికి రాని
సోదరి ఇంట భగినీ హస్త భోజనం చేసే కన్నయ్యే మన అన్నయ్య!!

9. వీర బంధుడు అన్నయ్య

– మైనేపల్లి సుబ్రహ్మణ్యం, ఆకునూరు

9490420476

ఆకాశంలో ఒక తార భువిలోని ఓ జంట మెరుపులా మెరిశాయి
ఆ మెరుపులో మోక్షమే కలిగింది
ధర్మార్థ కామ మోక్షాలు ప్రజ్వరిల్లాయి
సంతాన ప్రాబల్యం ఓ ప్రబంధ వేదిక
అమ్మానాన్నల ముద్దు మురిపాలు ఆగణ్యం
శరీర ధర్మం ఓ ప్రకృతి ప్రభంజనం
అన్నయ్య ఉన్నాడని దరిచేరే చెల్లెలు
అక్కయ్య కలదని చేరే తమ్ముడూ ఉంటారు కాని
తల్లిదండ్రుల చెంత ఉండే దెవ్వరు?
వీర బంధుడు ఒక్కడే ఒక్కడు– అతడే అన్నయ్య "గణనాథుడు".

10. అన్నయ్య మనసు నిర్మలం

– శ్రీమతి పెళ్ళూరు శేషకుమారి, నెప్పల్లి

9392458160

అన్నయ్య అనే కమ్మని పిలుపులోని మార్దవాన్ని
రక్త సంబంధపు అనుబంధాన్నీ రంగరించి
అమ్మా నాన్నా, అన్నా తమ్ముడు, అక్కా చెల్లి బంధాలతో
ముడపడిన కుటుంబ ఆత్మీయతను పంచుకొన్న మనం
మతమేదైనా, కులమేదైనా, మానవతే మన నైజం
వసుధైక కుటుంబం మన భారతం
ఆప్యాయతల, అనుబంధాల సుమహారం
అందునా ఈ ఉగాదిలో అన్నయ్య ఆత్మీయతను
అభిమానాన్నీ ప్రస్ఫుటీకరిస్తూ
రక్త సంబంధం లేకున్నా "అన్నయ్య" అనే పిలుపు ఆవహించి
పరాయి ఆడ పడుచును సోదరిలా ఆదరించాలనీ
అన్నగా అక్కున చేర్చుకోవాలని నినదిస్తూ
వాస్తవాన జరిగే అత్యాచార ఘాతుకాలను నిరసిస్తూ
నిండు మనసుతో "ఈ సందోహాన్ని" అపేక్షిస్తున్నాను
సృష్ట్యాది నుండి మరల వచ్చినా
నిన్న మన్మధ– నేడు దుర్ముఖి
ఈ వసంత శోభలో కోయిలల కుహు కుహూ రాగం కూనిరాగమైనా
ఆనవాయితీ తప్పని షడ్రుచుల ఉగాది పచ్చడి ఊరిస్తుంటే
"అన్నయ్య" అనే పదంలోని నిర్మలత్వంతో
దుర్ముఖిని స్వాగతిస్తున్నాను.

11. ఆత్మీయ అనురాగ పుంభావమూర్తి అన్నయ్య

– దండిభొట్ల దత్తాత్రేయశర్మ

9247558854

ఊహ తెలిసిన నుంచి ఉద్యోగ భారంతోనో, వయసు దూరంతోనో
నాన్న నాకు అరుదుగా కనిపించే వ్యక్తి అయినప్పుడు
"అన్న" అంటే అందుబాటులో ఉండే "నాన్నే"ననిపించేది
బజారుకెళ్లాలన్నా, బడికెళ్లాలన్నా
అమ్మ రక్షణ భారాన్ని తానే వహిస్తూ నేటికీ
నా ధైన్యాన్ని పోగొట్టి సైన్యంలా నిలబడతాడు
అమ్మ గోరుముద్దల్లోను, నూతి చన్నీళ్ళ స్నానాలలోను
తిరునాళ్ళ తీపి జీడీ కొనుగోళ్ళలోను,
వేసవి వెన్నెల రాత్రుల ఆరుబయట పడకల్లోను జతకాడే కాదూ
చదువు సందేహాలలో సరస్వతి సందేశంలా సంస్కరించేవాడు మా అన్నయ్య
వస్తువులను పోగేసుకోవటమే అభివృద్ధికి
కొలమానమనుకొనే రోజుల్లోనూ
మనుషుల్ని మనసుల్ని ముడి వేసుకోవటమే మూలం
అన్న అభ్యుదయ వాదిలా అగుపిస్తాడు మా అన్నయ్య
కోపంలో దూర్వాసుడైనా పట్టుదలకు విశ్వామిత్రుడు
ఆదరణలోను, ఔదార్యంలోను వసిష్టులాంటివాడు
నా నాలుగు పదుల వయసులోను
అంటిపెట్టుకొన్న ఆత్మీయతకు, అంటుకొంటున్న అనురాగానికి
పుంభావమూర్తి మా అన్నయ్య.

12. అనురాగపు కొండ అన్నయ్య

- శ్రీమతి గుడిపూడి రాధికారాణి, మచిలీపట్నం

9494942583

వెన్నంటే అన్నంటే- మిన్నంటే ప్రేమున్నా
వాడిపైనా వాడియైన- ఫిర్యాదుల ఫిరంగి మోతలు
ఇదంతా నా పెళ్ళి వరకే- అన్న వదనం విరిసిన దిరిసెన
అప్పగింతలు నాడు కురవని మేఘం
-యెడ చాటు తెలిపింది యెదబాటు మమత
దూరంగా నిలబడనిదే- ఆసాంతం కనబడరు కదా
నేను, అన్నయ్యా వీణా, తీగలుగా వేరు వేరైనా
పలికేది ఒకే రాగం- అనురాగం
ఆలయ స్తంభాలుగా వేరు వేరు
మోసేది ఒకే ప్రాకారం- మమకారం
మా అన్నయ్య తాను విల్లుగా కదలక నిలిచి
నను రివ్వున సాగే శరంగా మలిచి
తను కత్తిపోట్లు తిన్న వెదురుగా నిలిచి
నను వేణు మధుర నాదంగా మలిచి
తను చినుకు పడి చిందేసే మట్టిగా నిలిచి
నను ఆహ్లాదపు ఆత్మీయపు పరిమళంగా మలిచి
తను ఆలయ పునాది రాయిగా మిగిలి
నను గోపుర శిఖరంగా నిలిపి-
ఇప్పుడు ఫిర్యాదుల్లేవ్, ఫిరంగి మోతల్లేవ్
కొండ దిగి దూరంగా నుంచుంటే
కొండ ఉన్నతి తెలిసింది-
మా అన్నయ్య బంగారు కొండ.

13. రక్షాబంధనమే అన్నయ్య

– శ్రీమతి మేరీ కృపాబాయి, మచిలీపట్నం

9989347374

అన్నయ్యంటే కుటుంబ అనుబంధం
అన్నయ్యంటే సామాజిక సంబంధం
విశాల సమాజంలో ఎందరో అన్నయ్యలు
అనాధ చిన్నారిని ఆదుకొనే వేళ అతడే అన్నయ్య
పేదరికంలో మగ్గిపోయే వేళ అమ్మాయికి ఫీజు కడితే అతడే అన్నయ్య
చిమ్మచీకటిలో చిక్కుకున్న స్త్రీకి దారి చూపి
రక్షించే వేళ అతడే అన్నయ్య
సమస్యల వలయంలో చిక్కుకున్న వేళ
పరిష్కారం చూపితే అతడే అన్నయ్య
అన్నయ్య భావన విశ్వ వ్యాపితం
అన్నయ్య అనురాగం ఎల్లలు లేనిది
అన్నయ్యంటే కుటుంబ బంధం
అన్నయ్యంటే సామాజిక అనుబంధం
అన్నయ్యంటే రక్షా బంధం.

14. అమ్మ అయ్యల కలగలుపు అన్నయ్య

- శ్రీమతి కందాళ జానకి, మచిలీపట్నం

అమ్మ అయ్యల కలగలుపు అన్నయ్య
ధర్మ పరిపాలకుడే మన రామన్న
పాండు పుత్రుల బలం ధర్మ రాజన్న
సోదర సోదరీ ప్రేమకు మూలమన్న
తలిదండ్రుల ఋణం తీర్చు తొలి తనయుడన్న
తండ్రి ప్రేమను పంచి తనవి నిచ్చునన్న
తన వారిగా తలచి నందర పైకి తెచ్చు
వదిన ప్రేమే తనకు పేరు మంచిగా నిచ్చు
పుట్టింటి బంధాన్ని తన తోడ ముడి వేయునన్న
స్వార్థ మెరుగని సాదు శీలియే మా అన్న
ప్రేమామృతాన్ని పంచేది అన్నయ్యే
ఆర్తి వేడిన చెల్లి మానాన్ని కాపాడే నన్న
కన్నయ్యలాంటి అన్నయ్యలున్న దేశం నాది
అన్ని బంధాలకు ఆదిమూలం మనది
నిత్య కళ్యాణ పచ్చ తోరణంగా
పిల్ల పాపల తోడ చల్లగా వర్ధిల్లు అన్న
మాకు పసుపు కొమ్మే చాలు, పట్టెడు కుంకుమే చాలు
అన్నలందరకు, మా అన్నలందరకు మంగళం, శుభ మంగళం.

15. ఆత్మ బంధువు అన్న

– శ్రీమతి వారణాసి సూర్యకుమారి,

మచిలీపట్నం 9849812443

సీ॥ అమ్మా నాన్నల యనురాగ మార్ణవమైన– అన్నయ్య అనురాగ మంబరమగును
అన్నయ్య కురిపించు అనురాగ వర్షమ్ము అంబు దమ్ముల తీరు హర్ష మొసగు
సాదరంబగు మామ సోదరున్ సందిట– బాలార్కుని కిరణ స్పర్శ తోచు
ఆప్యాయ మొలికెడు అన్నయ్య పిలుపన్న– మలయానిల మ్ముగ మదిని తోచు.

ఆ.వె॥ అన్నయన్న పిలుపు ఆనంద ప్రదమగున్– రక్త బంధమే యనురక్తి యనగ
సోదరులిక ప్రేమ సుంత పంచిన చాలు– కాన వచ్చు అన్న కనుల తృప్తి.

సీ॥ అన్నయ్య కిగడను అగ్రాధి పత్యము– పెద్దకొడుకనెడు పేరు నిలుపు
వరుసగ గృహమున గురుతర బాధ్యతల్– నిర్వహించ గ కడు నేర్పు చూపు
కష్ట సుఖమ్ములు కాదు లాభ నష్టముల్– సహన సంపద తోడ

సంస్కరించు
అనుజుల నడిపించ నాదర్శ మార్గమ్ము- అసమాన ప్రతిభను
అవధరించు.

తే।।గీ।। వినయ సంపన్నులైన వారు విద్య నేర్చి- ప్రగతి పదమున
ప్రతిభతో పరుగు లిడుచు
లక్ష లార్జించు చుండగ లక్షణముగ- కురియ నానంద
బాష్పాలు మురియు నన్న.

సీ।। శ్రీరాము నంతటి స్థిర చత్తు నన్నగా- పొందగల్గుటపూర్వ పుణ్య
ఫలమె
నిస్వార్థ బుద్ధితో నిరతము కృషి సల్పు- మా యన్న విధిగమా
మంచి నెంచు
అన్నయ్య బోధించు కన్నయ్య నింక- మంచి చెడుల గీత
ఖచ్చితముగ
ఆత్మ బంధువు మాకు ఆత్మీయుడగు అన్న- సన్నిధిన్
తలతుము పెన్నిధిగను.

తే।।గీ।। తల్లిదండ్రుల యెడభక్తి తరగనీక- అలుక నెరుగక, మా యన్న
అలుపు లేక
సాకు కుశలమ్ముగ కుటుంబ సారధిగను- కొండ వలె నుండు
మా అన్న అండ మాకు.

16. పుట్టింటి వేలుపు అన్న

– శ్రీమతి ముదిగొండ సీతారావమ్మ,

మచిలీపట్నం 9299303035

అన్నంటె సగమౌను, అమ్మలోనెప్పుడు– అనురాగ సుమముల నంద
జేయు
అజ్ఞాన తిమిరమ్ము నార్పి వేయుచు తాను– దీధితుల్ వెదజల్లు దివ్వె
యగును
అభిమానమును పంచు ననుజుల కెప్పుడు– స్వార్థ భావము లేని
సదయుడగును
అమృత మెచటనగ అన్న మదిని దాగు– రక్త సంబంధమ్ము రక్తి నిచ్చు
అమ్మలోన నాది, నాన్నలో తుది కల్సి– అన్న యన్న పదము నమరె
గాన
అమ్మలోని ప్రేమ, నాన్న పాలన బుద్ధి– ఉన్న వాడె "అన్న" ఉర్వి
యందు.

2. త్యాగ శీలి యితడు తన యనుజులకునై– పాలను మురిపాలు
పంచి యిచ్చు
వారి భవిత కొరకు వచ్చు ఆపదలన్ని– దాటి ముందు నడచు
ధర్మ మూర్తి.

3. అమ్మ నాన్న పిదప నాదరించెడు వాడు– అన్న యొక్కడగును
యతివ కెపుడు

అన్న తమ్ముల ప్రేమ అక్క చెల్లెలు కోరు– ఆదరణంబు అభిలషించు
అత్తింట ఎన్నున్న పుట్టింటిపై ప్రేమ– వీడ దెప్పుడు కాంత వింత గాదు
అమ్మలో సగము "అ", నాన్నలో సగము "న్న"– అవి రెండు కలిసిన
అన్న యగును
అమ్మ వోలె సాకు అన్న తా వెంటుండి– అన్న ధైర్య మొకటే
అతిశయించు
ఎచట నున్న కాని ఎప్పుడు పుట్టింటి– మేలుకోరు ఇంటి
వేలుపగుచు
కంసు వంటి వానన్నగా కాన నీకు– శూర్పణఖ వంటి చెల్లెలు శోభ
యగునె?
కాచి రక్షించెడి కరుణాకరునియిచ్చి– అమ్మ బ్రోవుము అవనిని అతివ
నెపుడు.

17. దేవుడి వరం అన్న

– మునగంటి వెంకటాచార్యులు, విజయవాడ

92925753560

ఆత్మీయులైన అమ్మా నాన్నల ఆద్యంతాల కలగలపైన కమనీయ రూపమే అన్న
నేనే మా కుటుంబంలో అగ్రజుడను– అందుకే తమ్మునిగా ఆ ఆప్యాయతను అందుకోలేక పోయాను
"అన్నా" అని నోరారా పిలువ గలిగిన పేగు బంధం నాకు లేకపోయినా జీవితం నాకొక అన్నయ్య నిచ్చింది
నేనామిత్రుని "అన్నా" అని ఆదరంగా అంటే– "తమ్ముడూ" అని ప్రతిధ్వనిస్తాడు
ఇద్దరం కలిసి మనసు పొరల్లోని ఎన్నో విషయాలను ముచ్చటిస్తాం
వృద్ధాప్యంలో నా మిత్రుడు హైదరాబాద్‌లో కొడుకు దగ్గరకు వెళ్లక తప్పలేదు
ఇలా కాలం మమ్మల్ని విడదీసింది– అయినా మనసులు దూరం కాలేదు
నేను భాగ్యనగరం వెళ్ళినప్పుడు చరవాణిలో వివరం తెలుసుకొని, నా భాగ్యంగా స్టేషన్ కొచ్చాడు
ఆ మిత్రన్నయ్యను చూడగానే గుండె బరువెక్కింది
గొంతు మూగబోయి కళ్ళు చెమర్చాయి
సరిగ్గా నడవలేని స్థితిలో నాకోసం స్వయంగా వచ్చిన ఆన్నయ్యను చూసి చలించిపోయాను
ఆదరంగా గుండెలకు హత్తుకొని ఇంటికి తీసుకొని వెళ్ళి ఆతిథ్యమిచ్చాడు
నా కవితా సంకలనానికి "అనుస్పర్శ" నందించిన ఆత్మీయుడీ అన్న
ఆర్ద్ర హృదయంతో నాకు వీడ్కోలు పలికి– నాకు దేవుడిచ్చిన ఆత్మీయుడైనాడు అన్నయ్య.

18. అన్నయ్య అమల బంధం

- శ్రీమతి సింహాద్రి వాణి, విజయవాడ 779939113

ఆ.వె అమ్మ నాన్న కలిసి అన్న రూపుగ మారి- సేవ చేయు నన్న చెల్లి కొరకు
అన్నకెపుడు చెల్లి ఆరవ ప్రాణమ్ము- అన్న కున్న ప్రేమ అద్భుతమ్ము

ఆ.వె కష్ట సుఖములందు కన్నవారికి తోడు- అన్న కూడ నిలిచి యాదుకొనును
అన్న ఉన్న చెల్లి కవనిలో కరువేది- కంటి రెప్ప వలెనె కాపు కాయు

తే।।గీ।। తనదు సుఖములన్ని త్యజించి వేసైన- అన్న చెల్లి కొరకు అన్ని తీర్చు
తల్లడిల్లు చుండు తల్లి దండ్రి వలెను- తోడ బుట్టినట్టి తోడు కొరకు

తే।।గీ।। అన్నలందున మా యన్న మిన్న యనగ- చాల కర్తవ్య నిష్టతో చక్కగాను
తల్లిదండ్రికి తోడుగా తాను నిలిచి- తోడ బుట్టిన వారికి త్రోవ చూపె

తే।।గీ।। తనదు జన్మమ్ము మిక్కిలి ధన్య మొంద- ప్రేమ వర్షము కురిపిస్తు పిన్నలెడల
చేయుచున్నాడు నా యన్న జీవ యాత్ర- అన్న సోదర బంధమ్ము అమలమవగ.

19. ఇష్ట దేవత అన్న

- శ్రీమతి లక్కరాజు వాణీ సరోజినీ
విజయవాడ 9346078829

సీ॥ అన్న నిన్ను దలచ ఆనంద ముప్పొంగు- మరువ జాలనెపుడు మదిని నిన్ను
కంటి రెప్పల వోలె కాచి కాపాడుచు- వెంట నంటెడి దొడ్డ వేల్పు వయ్య
విద్యలందున నీవు విలసిల్ల వలెనని- అభిలషించెడు గొప్ప అన్న నీవు
ఎన్ని జన్మలకైన నిను సరిపోలిన- అన్నగానగ జాల నవని యందు

ఆ॥ కలిమి లేములందు కష్టసుఖములందు- నిన్ను మించి నట్టి నెలవు కలదె?
ఏక గర్భమందు ఏర్పడు బంధమ్ము- త్రుంచ నలవి కాదు ఎంచి చూడ.

ఆ॥ అన్న యనగా నెంతొ ఆత్మీయ భావన- పొంగి పొరలు ఎడద పొరలనుండి
మనసు నిండ ప్రేమ మమతల నెలవైన- పేగు బంధ మిలను వీగి పోదు

ఆ॥ ఎన్ని జన్మలందు ఏర్పడు బంధమో- వీడ రాని దెపుడు వాడి పోదు

రక్త బంధ మెంతొరమణీయ మౌగాద– పూవులోన తావి పొదిగి నట్లు

ఆ॥ ఆప్త మిత్రువోలె ఆడి పాడిన రీతి– మరపు రాని గాఢ మైత్రి మాది
కల్మషం బెరుగని గాఢాను రాగంబు– తరిగి పోదు మదిని తొలగి పోదు.

ఆ॥ కష్ట సుఖము లందు ఇష్ట దేవత వోలె– తోడు నిలిచె నతడు వీడ కుండ
ఆది నుండి నన్ను అత్యంత ప్రేమతో– చెల్లి యనుచు పిలిచి చెలిమి జేసె.

20. అరుదైన బ్రహ్మ కమలం అన్నయ్య

- కందికొండ రవికిరణ్, విజయవాడ 9491298990

అన్న యనంగ మా "అమ్మ", "నాన్న"లలో సగము సగము
గుణము చూడ నది తలిదండ్రుల గుణ యుగము
తోబుట్టువులకు అతని యండ పెను నగము
దోసమెంచక అనుజుల నాదరించును, ఇచ్చు భాగము
లక్ష్మణాగ్రజపాండవాగ్రాజుల వలెచూపు ననురాగము
పెంచగా చూచు పెద్దల కీర్తిని, మెచ్చగ బంధు జగము

తన చదువు నాపి తమ్ములను బడికి పంపి చేయూతై నాడు
అమ్మకు ఇంటి స్థితి గతులు ఓడలు బండ్లుగా మారినపుడు
సహజన్ముల సంతాన యోగ క్షేమ మరయు నెల్లప్పుడు

శిక్షించు తీక్షణత్వమున సూర్యుడు, అనురాగ శీతలత్వమున చంద్రుడు
ఇవ్వటమే తప్ప అడుగు టెరుగడు, మాట తప్పడు, మడమ త్రిప్పడు
అన్నకు రాముని, తమ్మునకు కైక సుతుని పేర్కొంటారు విజ్ఞులు

అన్నయ్య లందరూ అలాగా ఉంటె ప్రతి ఇల్లు అగు నయోధ్య
భరతుడు నేనైనా కాకున్నా, మా అన్నయ్య రాముడే
దేహానికి హృదయం రీతి, అన్నయ్య మా కుటుంబానికి
మనకంటూ ఏమున్న వీలోకాన? రక్తసంబంధము, తోడ
బుట్టినవాడూ కాక?
పూలూ చెట్లూ ఎన్నున్నా, తావి ఉన్న తావునకే కదా పూల
సజ్జలు చేరికలు
పూవు వంటి అన్నయ్యను శోభిల్ల జేయు "తావి" వదిన
ఇంటి ఇల్లాలు చూపు ఆదరణాప్యాయతలే ఇంటి గడప గవాక్షాలు
దుర్భావన వాయువులు వీడి సద్భావన పవనాలతో ఆయిల్లు
విలసిల్లగ.

21. కష్టజీవి అన్నయ్య

– శ్రీమతి కోనేరు కల్పన, విజయవాడ 9246493712

అన్నయ్యంటే ఆత్మ బంధువు– ఒక అపురూప ఆనంద తరంగం
"మా అన్నయ్య" అని అంటుంటే కించిత్ గర్వం కూడా
నాన్న అంత అండ– అందమైన భరోసా కూడా
అలాంటి అన్నయ్య అమెరికా నుంచి వస్తున్నాడు
ఉన్న నాలుగెకరాలూ అమ్మి అన్నయ్యను అమెరికా పంపినప్పుడు
రేపు తమ బ్రతుకేమిటాని అమ్మా నాన్నా అనుకోలేదు
రైతు కాస్తా కూలీగా మారి, పాలు కూరలు, ఊరగాయ అమ్మి సంతృప్తిగానే బతికారిన్నాళ్ళు
ఇప్పుడు ప్రయోజకుడై మిగిలిన రెండు నిట్టాళ్ళపాకను
డబల్ బెడ్‌రూమ్ డాబాగా మార్చి, తమ్ముణ్ణి ఐ.ఏ.ఎస్ చదివించి, చెల్లాయి పెళ్ళి చేసేందుకొస్తున్నాడు
గుగ్గిళ్ళు తేగలు తంపటకాయలు పంచుకుతిన్న రోజులూ,
కొంకి గడ వాసంతో సీమ చింతకాయలు కోసిచ్చిన రోజులూ గుర్తుకొస్తున్నాయి
తాను చెరువులో ఈత కొట్టిన సంగతి తమ్ముడు ఇంట్లో చేరవేస్తే
వంద గుంజీలు తీయించిన అన్న గుర్తుకొస్తున్నాడు
ఈ అన్నయ్యే చిటారు కొమ్మ జామపళ్ళు కోసి ఆబగా మాతో తినిపించేవాడు
మా ఇద్దర్నీ సైకిల్‌పై స్కూల్‌లో దింపి తానూ కాలేజీకెళ్ళిన అన్నయ్యే జ్ఞాపకమొస్తున్నాడు
మా మీదా, మా ఊరిమీదా. తెలుగుజాతి పైనా, భారత భూమి మీదా

అపార గౌరవం ఉన్న ఆ అన్నయ్యే వస్తున్నాడు
నవ్యాంధ్ర ఏర్పడి అమరావతి రాజధాని రూపుదాలుస్తున్న వేళ
ఉప్పొంగిన ఆనందం, పులకించిన డెందంతో
ఎంతో ఆశతో, ఆంధ్రా స్వర్గం అనే భావనతో వస్తున్నాడు
ఇక్కడ మోసాలు, రాక్షసత్వాలు, అవినీతి, పక్షపాతం, క్రూరత్వం తెలిస్తే
మళ్ళీ ఈ గడ్డ మీద కాలుమోపడేమో?
మీడియా నిత్యం కోడై కూస్తుంటే– దాచేస్తే దాగని సత్యాలా?

22. మిన్నంటిన గౌరవం అన్న

-పంతుల వెంకటేశ్వరరావు, విజయవాడ 9908344249

సీ॥ ఇంటి పెద్దగ పుట్టి, కంటి పాపగ నిల్చి- అండగా నుండి సాయంబు జేయు
తోడబుట్టిన వారి తోడూ నీడై తాను- అభిమానమును చూపి ఆదరించు
నాన్నగారి పిదప నాన్నగా నిలబడి- భుజములన్ బాధ్యత మోయు చుండు
వంశ గౌరవమును, పురువు ప్రతిష్టలు- పెంచగా నిత్యము పెంచుకొనును
కన్నవారికి, తనకంటే చిన్నవారి- కింటి పేరు నిలుపు నెంతగాను
అమ్మా నాన్నలోని ఆది వర్ణంబులై- అన్న యన్న గొప్ప యర్థ మిచ్చు

ఆ.వె- ఆ విధాత బ్రహ్మ అమ్మను సృష్టించె- ఆదరింప నెప్పుడు అవని యందు
అటులే నాన్న బదులు అన్నను పుట్టించె- ఆదరింప నెప్పుడు అవని యందు.

తే॥ గీ॥ రక్ష కట్టిన చెల్లికి రక్షణిచ్చి- అన్న యన్న పిలుపుకు దానాద మరచి
జీవితాంత మాదు కొనెడు జీవి యితడు- అట్టి అన్నయ్య పిలుపు

నత్యద్భుతంబు.

ఉ. అన్నకు గౌరవంబు నిడ, యా భగవంతుని రీతిగన్, సదా
చిన్నలు చూడ నాతడును చింతలు దీర్పగ ప్రేమ పంచుచున్
దన్నుగ నిల్చి, ఎల్లపుడు తండ్రిగ దల్లిగ రక్ష ణిచ్చు దా
గన్నులలోన దాచుకొను నిక్కము భూతలంబునన్.

సీ. అలనాడు సౌమిత్రి అన్న రామయ్యకు– సేవకుని క్రియను సేవచేసే
అంధుడైనను గాని అంబికా పుత్రుని– ప్రభువుగా జేసె పాండు రాజు
తమ కెంత బలమున్న తమ్ములు నల్గురు– అన్న ధర్మరాజు మాట నాలకించె
బలరాము దేవుని భగవంతుడైనను– కన్నయ్య నిత్యమ్ము గౌరవించె

తే।।గీ।। ఏ చరిత్రను జూడు, మెందెండు జూడు– అన్న యన్న భావ మెప్పుడున్ మిన్ను నంటి
గౌరవాస్పదమై నిల్చె ఘనము గాను– అందుకే "అన్న!" అందుకో వందనంబు.

23. మా (లక్ష్మీ) అన్న- అయ్య

- శ్రీమతి కొమాండూరి కృష్ణ, విజయవాడ 9246434485

అన్న శబ్దానికి తండ్రి అనే అర్థం ఉంది. అన్న- అయ్యా అంటే తండ్రి పెద్ద రామాయణంలో కుశల ప్రశ్నలతో భరతుడిని "తాత! నాయన" అని ఆదరిస్తాడు. వారూ ఆనాటి అన్నలు
ఆచారం మారింది. అన్నదమ్ముల వైరం పెరిగింది. ఇక అన్నకు చెల్లెలు ఉండి, కట్నం ఎక్కువ ఇవ్వాల్సి వస్తే, విలవిలలాడే నేటి దుస్థితి వర్ణనే కవిత-

శ్రీరామ రామ- అన్న ఆ అన్నే" యని మనుజు లన్న
సిరితోడ కావయున్న- రామన్నే యని అనుజులన్న
ఆ రామ పాదమన్న- రాతినీ నాతిగా చేసె నన్న
ఆ సీత శోక మాప- ఆ రాతి రావణున్నే నేనన్న
"కన్నా" నోటిన మన్ననూ- కానినంతానే వాలినా
వెన్న నోటిన ఉన్ననూ- కాన నటులే జారిన
చిన్ని దూడల తోడనూ- కాన కటులే చేరిన
మిన్న చేతల అన్నయూ- ఆన లెటుల మీరెనో!

అదే నేడు-

భరణ మీయగ- నా కన్న వారలు మెచ్చునా!
ఆరణ మీయక తెచ్చినా- నా అన్న భాగము హెచ్చునా!
ఇరవు కోరక వచ్చెనా- ఆరెన్న! బావగా తెచ్చునా!
బతుకు తీరగ చచ్చినా- ఆ యన్న కావగా వచ్చునా!
అన్న యన ఇటు లుండునా- అన్నియును కడ తేర్చునా!
కన్నమనమును చూడని- అన్నయును అన్నయేనా!
అని ఎంతో వగచి వగచి- తానన్ని విడచి- నడచి
ఎన్న రాముని పూజ నెంచి- పరమ పదము చేరనా!

24. అంతా నాకు దేవుడిచ్చిన అన్నయ్యలే

- శ్రీమతి పద్మావతీ శర్మ,

విజయవాడ 9291468295

అమ్మకు ఆసరాగా గిలక్కాయలతో ఆడించేవాడు మా అన్నయ్య
దోగాడుతూ మట్టిలోకి పోతుంటే, ఎత్తుకోలేక పోయినా, మొత్తుకొని పొట్టకు కరిపించుకు తిరిగాడు
తన, నా పుస్తకాల సంచీలు మోసినవాడు- ఆటల్లో నాకు దెబ్బ తగలకుండా కాపలా ఉన్నవాడు
నా సంతోషం కోసం చాక్లెటు నా స్నేహితులకిచ్చిన వాడు
కాలేజీ రోజుల్లో కంటికి రెప్పలా కావలి కాసినవాడు
పట్టరాని కోపమొచ్చినా నాకోసం బావను క్షమించేవాడు
తన పిల్లల కన్నా నా పిల్లలనే అతిగా ముద్దు చేసేవాడు
భార్యతో గొడవలుపడ్డా నా యోగ క్షేమాలే చూసేవాడు
నా జబ్బు తగ్గాలని ఉపవాసాలు చేసి మొక్కు తీర్చుకొనేవాడు
అన్నీ చేసి, ఇక చేయడానికేమీ లేదని పించాడు
అబ్బ! యెంత బాగుంది ఈ ఊహా చిత్రం! ఎందుకంటే నాకు అన్నయ్యలే లేరు
అందుకే- మీరంతా నాకు దేవుడిచ్చిన అన్నయ్యలు- మా అన్నయ్యలు.

25. అనురాగమూర్తి అన్నయ్య

-పాణిగ్రాహి రాజశేఖర్

విజయవాడ 9292006075

అమ్మలో సగం నాన్నలో సగం అన్నగా రూపాంతరం
అమ్మ ప్రేమను పంచి, నాన్న శిక్షణ నేర్పే ప్రాకారానివి
నా ఆనందం కోసం అహర్నిశలూ శ్రమిస్తావు
నా విజయమే నీదిగా భావించి ఉప్పొంగిపోతావు
అర్థంకాని విషయాల్ని అవలీలగా బోధిస్తావు
మానవ సేవే మాధవ సేవ అంటూ సమాజమే దేవాలయమంటావు
శ్రమైక జీవనమే నీ మార్గం- అదే అందరికీ ఆదర్శం
ఎన్నాళ్ళైనా ఎన్నేళ్ళైనా- వీడిపోదు మన బంధం
జన్మజన్మలకీ నిలవాలి- ఈ న్నదమ్ముల సౌభాగ్య బంధం.

26. అన్నన్నా

– పువ్వాడ తిక్కన సోమయాజి

విజయవాడ **9885628572**

1. అన్నా! అన్న! ఇదేమి దుర్విధి! అనూహ్యంమన్న! నన్నింక నీ
మన్నన్ కాదన నన్న! చేసితిని అన్నాయమ్ము, నీ కమ్మకున్
మున్నే నే పసిగట్టి చేటు, నుడువన్, మోతైన మాటాడి వీరి
మ్మన్నన్ తల్లిటు వచ్చితిన్ శరుడనై ఆలోచనా శూన్యతన్

2. తరలితీవు బంగారు లేడి తరుము కొనుచు– కొంతవడికి వింటిమి
మేము వింత గొలుపు
నార్త నాదమ్ము "హా లక్ష్మణా" రవమ్ము– స్పష్టమది నీదె గొంతు,
ఉచ్చైస్స్వరమ్ము.

3. వెను వెంటనేపోపొమ్మన– వినని ననున్ తల్లి రూక్ష వీక్షల నురిమెన్
మనసును రాయి పొనర్చుచు– నని వార్యపు గతిని కదలితన్నా
వినుమా.

4. ఏదీ తల్లి ఇటుండ బాసితినిగా, ఈ పంచ వాటీ స్థలిన్
ఎదీ లేదిట లోగిలిన్ వెలుపలన్, ఏదేని కీడయ్యెనో
ఆ దేవిం గొను పోయి రక్కసులు ద్రోహమ్మేమి కాంక్షించిరో?
నా దైవంమగు తల్లి, అగ్రజుని ప్రాణమ్మింక నేమౌనొకో!

5. అనుచున్ లక్ష్మణుడశ్రు ధారల హృదబ్జాంత ర్దళోద్విగ్నతన్
ప్రణమిల్లెన్ త్రప నొంది, అగ్రజునకున్ పల్కండు తొళ్కండహో
కినుకన్ బూనెనొ? లోని కోప బడ బాగ్నిన్ మ్రింగి చల్లార్చెనో?
అనుకొంచన్న వెంటనంటి తరలె నారణ్య సంశోధనన్

6. రాక్షస సంహారము– ముని రక్షణయు తన అవతారలక్ష్యము
లగుచో
సుక్షత్రియుడౌ రఘు పతి–దీక్షకు భూ పుత్రి రక్ష తీక్షత జూపెన్.
వినుమా.

27. అన్నయ్య పురుషోత్తముడు

– తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు

విజయవాడ 9703776650

1. సీ॥ అన్నయ్య లేకుంటె, అన్నమే లేదపుడు– మా తండ్రి శివలోక మరిగె గాన
కష్టాల కడలిలో నిష్టంగ నెదురీది– ఆదరించెను మము నమిత ప్రేమ
స్వార్జన మితమయ్యు స్వార్థంము శూన్యమై– అనుజుల పోషించె నమృత మూర్తి
తప్పొప్పు లెరిగించి దండించి, భూషించి– మంచి మార్గము జూపె నంచితముగ
జ్యేష్ఠ భ్రాతు స్థాన శ్రేష్ఠుండు పూజ్యుండు– సద్వ్రతాచరణ ప్రశస్తుడతడు
పరమ ధర్మమూర్తి పురుషోత్తమాచార్యు– నెలమి దలతు హృదిని నిష్ట తోడ.

2. అన్నయ్య కంఠాన నినదించు పద్యముల్– నాకెంతొ ప్రేరణై రక్తి నింపె
పుష్ప విలాపంపు రసధునిన్ మొదటగా– అన్నయ్య నోటనే విన్న వాడ
ఆంధ్ర భాషా యోష అనురాగ వల్లరుల్– అన్నయ్య వలననే అలము కొనెను

సరసవినోదినీ సమ్యక్ సమస్యలన్– అన్నయ్య చెప్పగ వినగనైతి
నన్ను భాషా ప్రవీణు గా వెన్ను తట్టి– చదువనేర్పించి నట్టి సజ్జను
డతడు
పైత్రు కంబగ సాహిత్య ప్రాభవంపు– వాసనన్ నన్ను పద్యముల్
పలుక చేసె.

3. సందోర్భోచిత నీతి పద్యముల సుశ్రావ్యంబు గా జెప్పచున్
అందంబై చెలువొందు భాషణము లత్యంత మోదంబులై
చిందుల్ వేయగమా మనంబు లహహా చెన్నొందు వాజ్మైపు ణిన్
మందుల్ నేర్వగలుంగు నట్టి సరణిన్ మాట్లాడు పెద్దన్నయౌ.

28. అపర భగీరథుడు అన్నయ్య

– శ్రీమతి వడ్డాది సుభద్ర

విజయవాడ 8885803170

కన్నవారు దివికేగిన వేళ– సంసారనౌక సంద్రాన ఉన్న వేళ
ధైర్యపు చుక్కానితో తీరం చేర్పించిన వేళ
మరపు రాని మహా మనిషి మా అన్నయ్య
తోబుట్టువుల సుఖమే తనది అన్న వేళ– రాత్రిం బవళ్ళు రెప్పగా కాచిన వేళ
తగిన వరు నెంచి నిస్వార్థంగా ఒక ఇంటిదాన్ని చేసిన వేళ
అరిషడ్వర్గాలు అదుపులో ఉన్నవాడు
స్వార్థం అనే పదం నిఘంటువులో లేనివాడు– నిరాడంబరుడు మా అన్నయ్య
ఇవ్వటమే తెలిసినవాడు, ఊరికి తలమానికం
కరువు కాటకాలలో చిరుధాన్యాలు పండించి పంచిన జన బాంధవుడు
సాగు జలలాల కోసమై నిరంతర శ్రమ చేసి సాధించినవాడు
రైతుల పాలిటి అపర భగీరథుడు– మా అన్నయ్య.

29. మనసున్న మా అన్న

-శ్రీమతి ఎస్.అన్నపూర్ణ

విజయవాడ 9290681769

వామన గుంటలాటల్లో- నది ఒడ్డున కేరింతల పరవళ్ళలో
నాతో పోటీపడే అన్నయ్య
అమ్మ కోపగిస్తే మూతి ముడిచి అలిగి కూర్చున్న నన్ను
ఉసిరికాయలిచ్చి ఊరడించినవాడు
మార్కులు తగ్గితే నాన్న రిమార్కుల నుండి నన్ను వెనకేసుకొచ్చిన వాడు
అల్లరి పిల్లల కాలేజీ గొడవల్లో నాకే ఇబ్బందీ రాకుండా కాచిన వాడు
పెళ్ళి చేసి పంపినపుడు చిన్న పిల్లాడిలా వెక్కిళ్ళతో ఏడ్చి కుమిలినవాడు
అత్తారింట్లో ఉంటె రోజూ దూరవాణితో మాట్లాడే ప్రేమమూర్తి
మేనల్లుడిని ఒడిలో కూర్చోబెట్టుకొని ఊసులెన్నో చెప్పి ఓర్పు చూపి
నేను నోరు తెరవకుండానే నా మనసు
గ్రహించి మసలే మా అన్నయ్య మామంచి వాడు.

30. మా పల్లె "కన్నయ్య" అన్నయ్య

– శ్రీమతి భమిడిపాటి బాలా త్రిపుర సుందరి

విజయవాడ

944017797

మా అన్నయ్య నాకే కాదు నా స్నేహితులకి కూడా అన్నయ్యే!
ప్రతి ఇంట్లో ఉండాలి– మా అన్నయ్యలాంటి మాంచి అన్నయ్య!
నాన్నకి చేదోడు వాదోడుగా..! ఇంటి పెత్తనం నాన్న తరువాత అన్నయ్యదే కాదు కాదు... ఇంటి పెద్దే... అన్నయ్య!

ఉదయం పాలపాకెట్టు మొదలు... చెల్లెకి, తమ్ముడికి బడి వరకు తోడుండాలన్నా
అన్నింటికీ అన్నయ్యే... అన్నయ్య లేకుండా ఏ పనీ జరగదు!
మా అన్నయ్యని చూస్తే అనిపిస్తుంది అమ్మ నాన్న అదృష్టవంతులని!
నాన్న కష్టం, అమ్మ బడలిక అన్నయ్యని చూడగానే పారిపోతాయి
ఎవరు పిలిచినా... ఎవరికి ఏ సహాయం కావాలన్నా....
చిటికెలో చేసి పెట్టే మా అన్నయ్య మాకే కాదు మా పల్లెకే అన్నయ్య!
పెద్ద చదువు చదివినా ఊరు విడిచి వెళ్ళక, తన విజ్ఞానాన్ని పల్లెకే పంచుతూ ఒంటరిగా ఉన్న వృద్ధులకి చేయూతనిచ్చే మా అన్నయ్య మా పల్లెకే వెలుగు!
మా అన్నయ్యవంటి అన్నయ్య ఇంటికొకడుంటే... వృద్ధాశ్రమాలెందుకు దండగ!

31. మా పెద్దన్నయ్య

– డా. రాచకొండ నరసింహశర్మ. ఎం.డి, విశాఖపట్నం

1. ఈ వసుధ వేయి నెలలుండు జీవులరుదు– అరుదు తగినంత ఆరోగ్య మమరి యుంట

కరమరుదు వారిలో కొంత ఘనత గనుట– అన్నియును గల్గిన వాడు మా అగ్రజుండు

2. "బాబ్జి"యను ముద్దుపేర బరుగునితడు– రాచ కొండ వంశాన్వయ రమ్య గుణుడు

తండ్రి నారాయణుండతి ధార్మికుండు– లక్ష్మి బోలు సీతా రామ లక్ష్మి తల్లి.

3. మహాదేవ శాస్త్రి నాముడు– గృహముల, మేడల, నభేద్య గురు సేతువులన్

రహదారులు రైళ్ళకునున్ సహనముతో కట్టె సుజన సంతతి పొగడన్.

4. పొగబండుల ఇంజనియరు– తగు మార్గము రైళ్ళు నడుప తా నిర్మించెన్

తగు నేర్పరి చిత్తరువుల– అగణిత సద్గుణ ధనుడు అకళం కుడున్.

5. అవకాశ మెంత యుండిన– అవినీతికి లొంగ లేదు అగ్రజు

డెపుడున్

అవసరము కతడు మారుట– రవి చంద్రులు సభము వీడి రాలిన యట్లే.

6. కప్పగంతుల వంశీయ కమ్ర హృదయ– సూర్య కాంతమ్మ సదమల చరిత్ర

ధర్మ పరురాలు మాయన్న ధర్మ పత్ని– భర్రు సహకారి ఈశ్వర భక్తురాలు.

7. సోదరులందు పెద్దతను, సూనృత వాక్యము తప్ప డెప్పుడున్
సోదర ప్రేమ లోతులవి శోధన కందక యుండు, జన్మ
జన్మోదిత పుణ్య సత్ఫల మొకో! యన మాకితడగ్రజుం డయెన్.

32. మార్గదర్శి అన్నయ్య

- మైనేని గోపాలకృష్ణ,

అమెరికా 001-256-882-5586

జీవిత సత్యాలు బోధించటంలో గురువు
బంధుత్వాలను తెలియ బరచటంలో ఆత్మీయుడు
సహచరులతో కలిసి మెలిసి తిరిగే నేర్పును నేర్పే హితుడు
తప్పు చేస్తే ఒప్పు కొనేట్లు చేయగల సంస్కారి
అందరితో చనువుగా సంచరించే సహృదయత నేర్పే సౌజన్యుడు
తండ్రి రూపంలో వెన్నంటి, సరైన మార్గ నిర్దేశం చేసి
జీవితానికి వెలుగు నిచ్చే జ్ఞానజ్యోతి
అన్నయ్య ఉండటం అదృష్టం, లేక పోవటం దురదృష్టం
శ్రమ, క్షమ, వంతు, వాటా, శ్రద్ధ, కారిన్యం, విభిన్నతల లోని
సూక్ష్మ మర్మాలు అనుభవంతో తెలియజేసే మార్గదర్శి అన్నయ్య

33. అందరికన్నా నా అన్న మిన్న

- చింతపల్లి వెంకట నారాయణ

కైకలూరు 9441091692

త్రేతా యుగంలో లక్ష్మణుని అన్న శ్రీరాముని కన్నా
ద్వాపర యుగంలో శ్రీ కృష్ణుని అన్న బలరాముని కన్నా
కలియుగంలో శ్రీనివాసుని అన్న గోవిందరాజుల కన్నా
వర్తమాన కాలంలో తెలుగు యువత అన్న ఎన్.టి.ఆర్. కన్నా
నా అన్న నాకు మిన్న- వేరెవరూ సాటి రారన్నా.

34. అపురూప ఫలం 'అన్నయ్య'

– శ్రీమతి కోపూరి పుష్పాదేవి, విజయవాడ 9440766375

అమ్మా నాన్నల అనురాగపు కొమ్మకు
అందంగా ప్రభవించిన అపురూప ఫలం అన్నయ్య!
మూర్తీభవించిన అమ్మ ఆపేక్ష
నిండుగా నెలకొన్న నాన్న మమకారం
జమిలిగా జతకూడితే అన్నయ్య
మూడేళ్ళు ముందుగా పుట్టినందుకు
ముద్దుముద్దుగా ముద్దు చేసేవాడు నన్నూ చెల్లిని
తన కడుపు నిండక పోయినా
మా ప్లేట్లలో పలావయ్యేవాడు
మా స్కూలు కాలేజీలకు
పెట్రోలు అక్కర్లేని వాహనమయ్యేవాడు
మా చదువుల బరువుతో క్రుంగిన భుజాలకు
గుమస్తా కట్టు కట్టుకునేవాడు
అమ్మానాన్నలు అర్ధాంతరంగా అగ్నికి ఆహుతైతే
రెండు పాత్రలూ అద్భుతంగా పోషించి
వన్స్‌మోర్‌లు అందుకునేవాడు
మా ఇరువురి బ్రతుకుల ఔన్నత్యం
అన్నయ్యకు జీవన సాఫల్యం
లక్ష్మణ భరత శత్రుఘ్నులకు
శ్రీరామచంద్రుడు ఎక్కువేమోగానీ
మాకు మా అన్నయ్య అంతకన్నా ఎక్కువ!
ఎంతో ఎంతో ఎక్కువ!

35. ఒక 'అన్న' అంతరంగం

– చలపాక ప్రకాష్, విజయవాడ
9247475975

ఇంటికి పెద్దకొడుకై పుట్టినా
బండ బరువుల్ని మోసే గాడిదై పుట్టినా
ఒక్కటేనట!
ఎంతటి చక్కని మాట చెప్పారు!?
అందుకేననుకుంటా, పెద్దల మాట చద్ది మూట అన్నది!!

నా బాల్యాన్ని, యౌవ్వనాన్ని
కష్టాల కుంపట్లో కరిగించి
కుటుంబ దాహాన్ని తీర్చిన
అన్నని నేను!

అమ్మ– ఇసుక
నాన్న– సిమెంట్ అయితే
మధ్య నిల్చున్న ఇటుకను నేను!!
ఏమీ మిగుల్చుకోలేని 'సున్నా'ని నేను!!!

అక్క ఆప్యాయతా
అన్న అనురాగం అంటే
ఏమిటో ఎరుగని ఏ'కాకి' జీవితాన్ని నేను!

ఇంటి కప్పుకి, ఊరి కంటికి
ఊతమై నిల్చిన
రచ్చ'బండ' నేను..
ఎవరూ గుర్తించని బానిస చిత్రాన్ని నేను!!

స్నేహితుల బంధాలే
అనుబంధాలై...
పాఠక మిత్రుల పలకరింపులే
పులకరింపులై...
'చివరికి' 'అన్నపై కవిత్వాన్ని చదివి
ఆనందంతో పరవశించి.. పులకరించిపోయే
అల్పసంతోషిని నేను..
సాహిత్యరంగంచే రాఖీ కట్టించుకున్న
అసలైన అన్ననే నేను
జగమంత కుటంబానికి నిత్య బానిసగా
సేవలందించే సంసిద్ధుడిని నేనే..నేనే!!


సరసభారతి ప్రచురణలు
మా అక్కయ్య
హృదయం
దర్శనీయ దేవాలయాలు
మహిళామణిక్యాలు
దైవచిత్రం
మా అన్నయ్య